# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 122 | పేజీలు : 08 | శనివారం | 09-05-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## ప్రధాని పర్యటన..

ఆ ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేయవద్దు!

- రేపు హైదరాబాద్‌కు రానున్న ప్రధాని మోదీ
- బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆంక్షలు
- రేపు అర్ధరాత్రి నుంచి 24 గంటల పాటు అమల్లో ఆంక్షలు
- డ్రోన్లు, పారా గ్లైడర్లను ఎగురవేయడం నిషేధం



2

## అందుకే మద్దతిచ్చాం

- టీవీకే మొదటి నుంచి బీజేపీకి వ్యతిరేకమన్న ఎంపీ
- స్థిరమైన ప్రభుత్వం, ఎన్డీయేను అధికారానికి దూరంగా ఉంచేందుకు మద్దతిచ్చామని వెల్లడి
- డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు మరో ఎన్డీయే కూటమి అని విమర్శ



2

## బీజేపీ మరింత బలోపేతం

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మరోసారి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంపై వీరిద్దరికి అవగాహన లేనట్లు ఉందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో కిషన్ రెడ్డి మాట్లాడుతూ..



2



## నేడే ప్రమాణస్వీకారం

2

బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా సువేందు అధికారి..

పశ్చిమ బెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికయ్యారు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా కోల్‌కతాలో అధికారికంగా ప్రకటించారు

భవానీపూర్‌లో మమతా బెనర్జీపై గెలిచిన సువేందుకే సీఎం పీఠం

నేడే కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రమాణస్వీకారం

ప్రధాని మోదీ హాజరుకానున్నట్లు సమాచారం

## కేంద్రం నిధులు ఇవ్వకుంటే తెలంగాణ అభివృద్ధి లేదు



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధికి మోదీ ప్రభుత్వం రూ. వేల కోట్ల నిధులు ఇస్తుందని కేంద్రం హోం శాఖ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఆ నిధులతోనే తెలంగాణ అంతో ఇంతో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కేంద్రం నిధులు ఇవ్వకుంటే తెలంగాణ అభివృద్ధి చెందే అవకాశమే లేదన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. దేశ రాజధాని నుంచి తాము నిధులు తెస్తుంటే.. కాంగ్రెస్ వాళు తెలంగాణ సొమ్మును ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలకు పంపుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీని నడుపుకోవడానికి తెలంగాణ సొమ్మును వినియోగిస్తున్నారని ఆరోపించారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని

### గొప్ప పరిశ్రమలన్నీ కొడంగల్‌కు

# తీసుకొస్తున్నాం

- దేశంలోని గొప్ప పరిశ్రమలన్నీ కొడంగల్‌కు తీసుకొస్తున్నాం : సీఎం రేవంత్ రెడ్డి
- కొడంగల్‌లో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- కొడంగల్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భూమిపూజ
- కొడంగల్‌లో రాజకీయాలు పక్కనపెట్టి పని చేద్దామని పిలుపు



2

హైదరాబాద్ పల్స్,కొడంగల్

దేశంలోనే గొప్ప ఆగమ శాస్త్ర సలహాదారులు సుందరవరదాచార్యులని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. సుందరవరదాచార్యులు పేరును కొడంగల్ లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏదో ఒక ప్రాంగణానికి పెడతామని వెల్లడించారు. తన సొంత నియోజకవర్గంలో పర్యటించిన రేవంత్ రెడ్డి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కొడంగల్‌లో రూ.110 కోట్లతో పునర్నిర్మాణం చేయనున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆయన భూమి పూజ చేశారు.

అన్ని విధాలా కొడంగల్ అభివృది రాష్ట్రం గర్వించదగిన గొప్ప కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించామని రేవంత్ రెడ్డి తెలిపారు. కొడంగల్ నియోజకవర్గానికి ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని గుర్తు చేశారు. కొండగల్ సమస్యల పరిష్కారం కోసం అందరినీ

## అడ్డదారులు తొక్కొద్దు

### ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయి..

యువతకు కొండా సురేఖ సూచన

- వరంగల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించిన ప్రభుత్వం
- యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దన్న కొండా సురేఖ
- ఎన్ని ప్రయత్నాలు విఫలమైనా ఉద్యోగ ప్రయత్నాలు ఆపొద్దన్న కడియం కావ్య



2

హైదరాబాద్ పల్స్,వరంగల్

వరంగల్‌లోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య చేసిన ప్రసంగాలు నిరుద్యోగులకు దిశానిర్దేశం

## రాజ్యాంగబద్ధంగా నడుచుకోండి

### ప్రభుత్వ ఏర్పాటులో జాప్యం వద్దు... : గవర్నర్‌కు స్టాలిన్ సూచన

- ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని గవర్నర్‌ను కోరిన స్టాలిన్
- ఎన్నికల ఫలితాలు వెలువడి, పాత అసెంబ్లీ రద్దయిన నేపథ్యంలో వినతి
- ప్రజాస్వామ్య పరిరక్షణకు, రాష్ట్ర సంక్షేమానికి ఇది అత్యవసరమని వెల్లడి
- ప్రభుత్వ ఏర్పాటులో జాప్యం తగదని డీఎంకే తరఫున స్పష్టం చేసిన స్టాలిన్



2

## మూసీ పునరుజ్జీవ పనులు

- ఆగస్టు నాటికి మూసీ పునరుజ్జీవ పనులు స్టార్ట్!
- తొలి దశలో రూ.7,055 కోట్లతో అభివృద్ధి
- మూసీ ప్రాజెక్టుపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశం
- మూసీ డీపీఆర్ వివరాలను మంత్రులకు అందించిన అధికారులు
- తొలి దశలో చేపట్టే పనులకు ఏడీబీతో చర్చలు ముగిసినట్లు వెల్లడి



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులను ఆగస్టు నాటికి ప్రారంభించాలని అధికారులను మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. ప్రజల ఆస్తులపై ప్రభావం లేని ఐదు కిలోమీటర్ల మేర పనులు చేపట్టాలని తెలిపింది. నిర్మాణాలపై ఎక్కువ

## పాలనలో ఆ రెండు

# చాలా ముఖ్యం

### కలెక్టర్ల సమావేశంలో చంద్రబాబు

- 7వ జిల్లా కలెక్టర్ల సమావేశం
- పాలనలో టెక్నాలజీ, మానవీయత రెండూ ముఖ్యమన్న సీఎం చంద్రబాబు
- ప్రతీ శుక్రవారం నియోజకవర్గాల్లో 'ఫీల్డ్ గ్రీవెన్స్ డే' నిర్వహణ
- ఫైళ్ల క్లియరెన్స్‌ను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం
- అర్జీల పరిష్కారంలో ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ తెచ్చుకోవాలని సూచన
- 90 రోజుల్లో అన్ని శాఖల కేపీఐలతో డ్యాష్ బోర్డు ఏర్పాటుకు సన్నాహాలు





2

హైదరాబాద్ పల్స్,అమరావతి

'పాలనలో అత్యాధునిక టెక్నాలజీని వినియోగించుకోవడం ఎంత ముఖ్యమో, అదే సమయంలో మానవీయ కోణంతో ఆలోచించి ప్రజలకు సేవలు అందించడం కూడా అంతే ముఖ్యం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కేవలం సాంకేతికతపైనే ఆధారపడి యాంత్రికంగా కాకుండా, ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, వారి పట్ల కరుణతో స్పందించాలని అధికారులకు ఆయన హితవు పలికారు. శుక్రవారం జరిగిన 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రెండో రోజు

## తనూజ హత్య కేసులో కీలక అప్ డేట్

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ఐపీఎస్ మాజీ అధికారి వినయ్ రంజన్ రే నివాసంలో పని చేసే నేపాలీ ముఠా గురువారం తెల్లవారుజామున ఆయన భార్య తనూజను హత్య చేసిందని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. నోట్లో గుడ్డలు కుక్కి ఊపిరాడకుండా చేసి ఆమెను హత్య చేశారని వివరించారు. నేపాలీ ముఠాలతో అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ప్రజలను ఆయన హెచ్చరించారు. అవకాశం కోసం ఈ నేపాలీ ముఠా ఎదురు చూస్తుంటాయని పేర్కొన్నారు. బెంగళూరు, ముంబై, పుణె నగరాల్లో నేపాలీ ముఠాలు నేరాలకు పాల్పడుతున్నాయని గుర్తు చేశారు. నిందితులను పట్టుకునేందుకు 10 బృందాలు రంగంలోకి దిగాయని సీపీ సజ్జనార్



2

# అడ్డదారులు తొక్కొద్దు

మొదటి పేజీ తరువాయి

చేశాయి. యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే మత్తుపదార్థాలకు బానిస కావొద్దని కొండా సురేఖ గట్టిగా హెచ్చరించారు. నేటి తరంలో సామాజిక మార్పులు వేగంగా వస్తున్నాయని, యువత నిబద్ధతతో పనిచేస్తూ తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కేవలం ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయని, అడ్డదారులు తొక్కొద్దని ఆమె హితవు పలికారు. ముఖ్యంగా ఉద్యోగ నియామకాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె ఈ సందర్భంగా ఆకాంక్షించారు.నిరుద్యోగ యువతలో ఉండే మానసిక ఒత్తిడిపై ఎంపీ కడియం కావ్య స్పందించారు. యువత ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలని, ప్రతిరోజూ మనలో మనం యుద్ధం చేసుకుంటూ మనల్ని మనం మెరుగుపరుచుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఎన్ని విఫలయత్నాలు ఎదురైనా ఉద్యోగ ప్రయత్నాలను ఆపకూడదని, కష్టపడితేనే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకుంటారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. "మనం తప్పు చేయనంత కాలం ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు" అని మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు నిరుద్యోగుల్లో ధైర్యాన్ని నింపాయి.ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా జరిగిన ఈ మెగా జాబ్ మేళాకు నిరుద్యోగులు భారీగా హాజరయ్యారు. కలెక్టర్ సత్యశారదదేవి, ఎమ్మెల్యే నాగరాజు మరియు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్న ఈ కార్యక్రమం, వరంగల్ ప్రాంత యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో నిర్వహించారు.

# ప్రధాని పర్యటన..

మొదటి పేజీ తరువాయి

రేపు (మే 10) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించనున్నారు. రాష్ట్రంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొంటారు. మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసులు హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు.బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో నేడు అర్ధరాత్రి 12 గంటల నుంచి 24 గంటల పాటు డ్రోన్‌లు, పారాగ్లైడర్‌లు, రిమోట్ కంట్రోల్ మైక్రో లైట్ విమానాలు ఎగురవేయడాన్ని నిషేధించారు. ఈ మేరకు మల్కాజ్‌గిరి పోలీసులు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో పౌరులు ఆంక్షలను పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# అందుకే మద్దతిచ్చాం

మొదటి పేజీ తరువాయి

తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటు కోసం టీవీకేకు మద్దతు ఇస్తున్నందుకు తమ పార్టీపై విమర్శలు గుప్పిస్తున్న వారిపై కాంగ్రెస్ పార్టీ ఎంపీ మాణికం ఠాకూర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీవీకే మొదటి నుంచి బీజేపీకి వ్యతిరేకమని, అందుకే తాము ఆ పార్టీకి అండగా నిలిచామని అన్నారు. స్థిరమైన ప్రభుత్వ ఏర్పాటు కోసం, ప్రజల తీర్పును గౌరవించేందుకు, దక్షిణాది రాష్ట్రంలో ఎన్డీయేను అధికారానికి దూరంగా ఉంచేందుకు టీవీకేకు మద్దతిచ్చామని తెలిపారు.ఫలితాలు వెలువడిన రోజు రాహుల్ గాంధీ స్టాలిన్‌కు, మమతా బెనర్జీకి ఫోన్ చేశారని చెప్పారు. బెంగాల్‌లో బీజేపీ 100 స్థానాలలో ఓటు చోరీకి పాల్పడిందని మమతా బెనర్జీ చేసిన ఆరోపణలను, రాహుల్ గాంధీ కూడా సమర్థించారని గుర్తు చేశారు. కానీ ఎన్డీయేకు వ్యతిరేకంగా తమిళనాడులో టీవీకేకు మద్దతివ్వాల్సి వచ్చిందని స్పష్టం చేశారు.కానీ ఇప్పుడు మాత్రం డీఎంకే మీడియా కాంగ్రెస్ పార్టీపై బురద జల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎంకే, అన్నాడీఎంకే బీజేపీ ఆశీస్సులతోనే తమపై విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. వాస్తవానికి తమిళనాడులోని డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు మరో ఎన్డీయేగా చెప్పవచ్చని అన్నారు. వారి అభిప్రాయం మేరకు, ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడానికి మేం సహకరించాలా అని ధ్వజమెత్తారు. టీవీకేకు అండగా నిలిచినందుకు తాము ఎవరికీ క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు.

# నేడే ప్రమాణస్వీకారం

మొదటి పేజీ తరువాయి

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త శకం ప్రారంభమైంది. రాష్ట్ర బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికయ్యారు. కోల్‌కతాలో శుక్రవారం జరిగిన బీజేపీ నూతన ఎమ్మెల్యేల సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర పరిశీలకుడిగా హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా... బెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి పేరును అధికారికంగా ప్రకటించారు. ఈ క్రమంలో బెంగాల్ తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు నేడే ప్రమాణ స్వీకారం చేయనున్నారు.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించి, 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు తెరదించిన విషయం తెలిసిందే. మొత్తం 294 స్థానాలకు గాను 207 సీట్లు గెలుచుకొని బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. ఈ నేపథ్యంలో శాసనసభాపక్ష నేత ఎన్నిక కోసం కోల్‌కతాలోని బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సహ పరిశీలకునిగా వ్యవహరించారు.ఈ ఎన్నికల్లో సువేందు అధికారి నందిగ్రామ్‌తో పాటు భవానీపూర్ స్థానం నుంచి కూడా గెలుపొందారు. ముఖ్యంగా భవానీపూర్‌లో తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీపై 15 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించడం ఆయనకు కలిసొచ్చింది.మే 9న కోల్‌కతాలోని ప్రసిద్ధ బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యే అవకాశం ఉంది. సువేందు అధికారి ఎన్నికతో రాష్ట్రంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు.

# బీజేపీ మరింత బలోపేతం

మొదటి పేజీ తరువాయి

ఈ పన్నెండు ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అందించిన సహకారంపై తాము ఎప్పుడు చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.హైదరాబాద్‌లో ప్రధాని మోదీ సభ తరువాత తెలంగాణలో మరింత బలోపేతం అవుతామని కేంద్ర మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమం కాదన్నారు. ఇది అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశమని ఆయన పేర్కొన్నారు. రూ. 9 వేల కోట్ల అభివృద్ధి పనులకు మోదీ నేరుగా తెలంగాణలో శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల కంటే ముందే ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన ఖరారు అయిందని చెప్పారు. తమిళనాడులో రాజ్యాంగ బద్ధంగా ఏ ప్రభుత్వం అయినా ఏర్పాటు చేయవచ్చునన్నారు

# పాలనలో ఆ రెండు చాలా ముఖ్యం

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పాలనా వ్యవస్థలో వేగం, పారదర్శకతతో పాటు మానవతా విలువలకు పెద్దపీట వేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఫైళ్ల క్లియరెన్స్, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం (పీజీఆర్ఎస్), టెక్నాలజీ వినియోగం వంటి పలు కీలక అంశాలపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు.

**అర్జీల పరిష్కారంలో బ్రాండ్ ఇమేజ్ రావాలి**

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో రాష్ట్రం ఒక ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్‌ను సంపాదించుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కొందరు అధికారులు అర్జీలను తీసుకుని కార్లలో పడేస్తున్నారనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని, ఇలాంటి అలసత్వం పునరావృతం కావొద్దని గట్టిగా హెచ్చరించారు. "ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి. కాగితాలు తీసుకుని పక్కన పడేయడం కాదు, సమస్య పరిష్కారమైతేనే ప్రజల్లో ప్రభుత్వపై విశ్వాసం పెరుగుతుంది" అని అన్నారు. ఇందుకు అనుగుణంగా 'ప్రజా దర్బార్' వంటి ఒక ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సింగపూర్ తరహాలో ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి కూర్చుని అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించే విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. దీనిలో భాగంగా, ప్రతి సోమవారం కలెక్టరేట్లలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే మాదిరిగానే, ఇకపై ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో 'ఫీల్డ్ గ్రీవెన్స్ డే' నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టర్లు 'గుడ్ విల్ మిషన్' గా క్షేత్రస్థాయికి వెళ్లి, ప్రతి నెలా ఒక నియోజకవర్గాన్ని నాలుగు సార్లు సందర్శించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

**ఫైళ్ల క్లియరెన్స్‌లో సత్వర స్పందన**

ప్రభుత్వ సేవలు ప్రజలకు వేగంగా అందాలంటే ఫైళ్ల క్లియరెన్స్ అత్యంత కీలకమని చంద్రబాబు పేర్కొన్నారు. గత మూడు నెలలతో పోలిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఫైళ్ల క్లియరెన్స్ సగటు సమయం 10 రోజుల నుంచి 2 రోజులకు తగ్గడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పెద్దమొత్తంలో ఫైళ్లు వచ్చినా, సగటున 10 గంటల వ్యవధిలోనే డిస్పోజ్ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తిని మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు, ఎస్పీలు కొనసాగించాలని, 24 గంటల్లోపు ఇ–ఫైల్స్ పరిష్కరించేలా శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు.పనితీరులో వెనుకబడిన అధికారులు వేగం పెంచుకోవాలని స్పష్టం చేశారు. ఇకపై మాన్యువల్ ఫైళ్లకు స్వస్తి పలికి, జిల్లా స్థాయి నుంచి హెచ్ఓడీల వరకు తప్పనిసరిగా ఇ–ఫైల్స్ మాత్రమే జనరేట్ చేయాలని ఆదేశించారు.

**ఆన్‌లైన్ సేవలతో అవినీతికి చెక్**

ప్రజలు తమ పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని వృధా చేసుకోకూడదని ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వ సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సమయం ఆదా అవ్వడంతో పాటు, అవినీతికి కూడా అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. 'వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర' ద్వారా ఇప్పటికే 29 లక్షల మందికి శిక్షణ ఇచ్చామని, డిసెంబరు నాటికి 100 శాతం ప్రభుత్వ సేవలను వాట్సాప్‌లో అందించేలా చూడాలని లక్ష్యం నిర్దేశించారు.స్మార్ట్ ఫోన్లు లేని 34 శాతం కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని, మాన్యువల్ టచ్ పాయింట్ల వద్ద వారికి వాట్సాప్ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. తుపాను, పిడుగుల వంటి ప్రకృతి వైపరీత్యాల హెచ్చరికలను నేరుగా ప్రజల మొబైళ్లకే పంపే వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు.ఈ సమీక్షలో భాగంగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ శాఖల పనితీరును, రోజువారీ లక్ష్యాలను ఒకే వేదికపై పర్యవేక్షించేందుకు వీలుగా ఒక సమగ్ర డ్యాష్‌బోర్డును రూపొందిస్తున్నామని తెలిపారు. రాబోయే 90 రోజుల్లో ఈ డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తెస్తామని సీఎంకు వివరించారు. ఈ సమావేశంలో పలువురు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# రాజ్యాంగబద్ధంగా నడుచుకోండి

మొదటి పేజీ తరువాయి

తమిళనాడులో కొత్త ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడి, పాత శాసనసభ కూడా రద్దయిన ప్రస్తుత తరుణంలో ప్రభుత్వ ఏర్పాటులో జాప్యం చేయడం తగదని ఆయన హితవు పలికారు.ఈ మేరకు స్టాలిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. "తమిళనాడు శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఎన్నికైన ఎమ్మెల్యేల జాబితాను ఎన్నికల సంఘం అధికారికంగా విడుదల చేసింది. దీనికి తోడు, పాత శాసనసభను రద్దు చేస్తూ గౌరవనీయ గవర్నర్ గారు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు" అని ఆయన గుర్తుచేశారు."ఈ పరిస్థితుల్లో రాష్ట్ర సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు, ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేసేందుకు కొత్త ప్రభుత్వం ఏర్పడటం అత్యవసరం. ఇది కేవలం కాలం యొక్క ఆవశ్యకత మాత్రమే కాదు, ప్రజాస్వామ్యంలో ఒక ముఖ్యమైన విధి" అని స్టాలిన్ తన ప్రకటనలో పేర్కొన్నారు.అందువల్ల, ప్రభుత్వ ఏర్పాటులో ఎలాంటి ఆలస్యం జరగకుండా, రాజ్యాంగం ప్రకారం కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలను గవర్నర్ వెంటనే తీసుకోవాలని డీఎంకే తరఫున తాను కోరుతున్నట్లు స్టాలిన్ స్పష్టం చేశారు.

# కేంద్రం నిధులు ఇవ్వకుంటే తెలంగాణ అభివృద్ధి లేదు

మొదటి పేజీ తరువాయి

ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదం కోసం మోదీ హైదరాబాద్ వస్తున్నారని వివరించారు. తమ నినాదం జై శ్రీరాం... జై తెలంగాణతోపాటు ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే అని స్పష్టం చేశారు. జై శ్రీరాం.. జై తెలంగాణ నినాదాలతో పరేడ్ బహిరంగ సభ దద్దరిల్లుతుందని చెప్పారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాదిరిగా తనకు దోచుకోవడం తెలియదన్నారు. రైతులకు బేడీలు వేసి అరిగోస పెట్టడం తనకు తెలియదని చెప్పారు. డ్రగ్స్ తీసుకోవడం కూడా తమకు తెలియదని పేర్కొన్నారు.కాళేశ్వరం, ఈ పార్ములా, విద్యుత్ కొనుగోళ్ల అవినీతి వంటివి తమకు తెలియదని కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యంగ్యంగా అన్నారు. ఫాంహౌస్ డ్రగ్స్ కేసులు కూడా తమకు తెలియదని చెప్పారు. మంది కొంపలు ముంచడం అసలే తెలియదంటూ కేటీఆర్‌కు చురకలు అంటించారు. నోరు అదుపులోకి పెట్టుకోవాలంటూ కేటీఆర్‌కు ఈ సందర్భంగా బండి సంజయ్ సూచించారు. నీ అహంకారం వల్లే కేసీఆర్ ఫాంహౌస్‌కు పరిమితమయ్యారని చెప్పారు. నీ కార్యకర్తలే కేటీఆర్‌ను చూసి ఆ పార్టీ కార్యకర్తలే అసహ్యించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ ఏం చేసినా అధికారంలోకి రావడం కల్ల అని కుండ బద్దలు కొట్టారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీయే అని ఆయన జోస్యం చెప్పారు. మోదీ సభ తరువాత రాష్ట్రంలో జరగబోయేది చూడండంటూ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. మే10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదికగా జరిగే ప్రధాని మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# గొప్ప పరిశ్రమలన్నీ కొడంగల్‌కు తీసుకొస్తున్నాం

మొదటి పేజీ తరువాయి

యాచించే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన తనకు ముఖ్యమంత్రి పదవి దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

**లగచర్లను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం**

విద్య, వైద్యం, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పేదలకు ఇస్తున్నామని సీఎం గుర్తు చేశారు. రాష్ట్రంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, కృష్ణా నదీ జలాలతో కొండగల్ భూములు తడవాలని పేర్కొన్నారు. కృష్ణా జలాలు వచ్చే వరకూ మంత్రి దామోదర, శ్రీహరిని నిద్ర పోనీయొద్దని సూచించారు. కొడంగల్‌లో వచ్చిన మార్పులు ప్రజలు గమనించాలని కోరారు. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గణులు ఉన్నాయని, లగచర్లను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని గుర్తు చేశారు. నాడు రాష్ట్రం నలుదిక్కులకు వెళ్లి చదువుకునే వాళ్లమని, నేడు రాష్ట్రం నలుదిక్కుల నుంచి కొడంగల్‌కు వచ్చి చదువుకుంటున్నారని కొనియాడారు.

**పేదల సమస్యలు పరిష్కరించేలా కృషి**

2034 వరకూ కొడంగల్‌లో రాజకీయాలు పక్కనపెట్టి పని చేద్దామని నాయకులకు, ప్రజలకు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశానికే మోడల్‌గా కొడంగల్‌ను తీర్చిదిద్దుతున్నామని, కోస్గీ నుంచి శంషాబాద్‌కు 300 ఫీట్ల రోడ్ వేసుకుంటున్నామని తెలిపారు. దేశంలో గొప్ప పరిశ్రమలు కొడంగల్‌లో పెట్టే ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో పనులు ఏం కావాలో విచారణ చేయాలని, మండలానికి ఒక కమిటీ చొప్పున వేసుకోవాలని సూచించారు. కమిటీలు గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని, పేదల సమస్యలు పరిష్కరించేలా అందరూ కృషి చేయాలని వెల్లడించారు.

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

కొడంగల్‌లో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి సీఎం భూమిపూజ చేసిన రేవంత్ రెడ్డి, లగచర్లలో నిర్మించే 430 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దౌల్తాబాద్ వేంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గీలో వేణుగోపాల స్వామి ఆలయం, కొడంగల్ నుంచే దౌల్తాబాద్, కోస్గీ ఆలయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. భూమిపూజలో మంత్రులు దామోదర రాజనరసింహ, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

# మూసీ పునరుజ్జీవ పనులు

మొదటి పేజీ తరువాయి

ప్రభావం లేకుండా అలైన్‌మెంట్‌లు మార్చాలని సూచించింది. ప్రాజెక్టులో భాగంగా మూసీలో పలు చోట్ల టూరిజం స్పాట్లుగా ఆకర్షించేలా రబ్బర్ డ్యాంలను నిర్మించేలా ప్రణాళిక చేశారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై నెలకొన్న అనుమానాలు నివృత్తి చేయాలని, ప్రయోజనాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులకు కేబినెట్ సబ్ కమిటీ దిశానిర్దేశం చేసింది.ప్రజాభవన్‌లో మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై కేబినెట్ సబ్ కమిటీ ఛైర్మన్ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సభ్యులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సమావేశమై ప్రాజెక్టు పురోగతి, నిధుల సమీకరణ, నిర్మాణ పనుల క్యాలెండర్?పై చర్చించారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు డీపీఆర్‌ను మంత్రులకు వివరించిన అధికారులు, ఐదు దశల్లో 55 కిలోమీటర్ల వరకు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.రిటైనింగ్ వాల్స్ : ప్రాజెక్టులో భాగంగా మూసీలో చెత్త తొలగించి శుభ్రపరచడం, రివర్ బెడ్ ప్రొఫైలింగ్ చేయడం, వరద నియంత్రణ కోసం రిటైనింగ్ వాల్స్, నదికి రెండు వైపులా రోడ్లు, ప్రధాన మురుగు నీటి కాలువలు, నీటి నిల్వ కోసం బ్యారేజీలు, నార్సింగి నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి ఉంటాయన్నారు. సుమారు రూ. 7.55 వేల కోట్లతో చేపట్టనున్న మొదటి ఫేజ్ నిధుల సమీకరణపై ఆసియా అభివృద్ధి బ్యాంక్?తో సాంకేతిక, ఆర్థిక చర్చలు విజయవంతంగా ముగిశాయని అధికారులు వివరించారు.మొదటి ఫేజ్?లో హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ ఉస్మాన్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు 21 కిలోమీటర్ల మేరకు అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ తయారీ దశలో ఉందని అధికారులు తెలిపారు. ప్రజల ఆస్తులపై ప్రభావం లేని ఐదు కిలోమీటర్లలో వెంటనే పనులను ప్రారంభించాలని మంత్రులు అదేశించారు. మొదటి ఫేజ్ పనులను ఆగస్టు నాటికి ప్రారంభించి, వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసేలా లక్ష్యం పెట్టుకోవాలని మంత్రులు ఆదేశించారు. దీనికి సంబంధించిన పూర్తి క్యాలెండర్‌ను సమర్పించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.పర్యావరణ అనుమతులను తీసుకోవాలని అధికారులకు మంత్రులు చెప్పారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం భూమిని రక్షణ శాఖ నుంచి తీసుకొనే ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. మూసీ పునరుజ్జీవనం వల్ల కలిగే ఉపయోగాలపై నగరంలో విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రులు అధికారులకు సూచించారు. బస్టాండ్లు, మెయిన్ రోడ్లపై హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సినిమా థియేటర్ లో కూడ వీడియోలను ప్రదర్శించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ విభాగాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు.పురోగతి స్పష్టంగా కనిపించేలా నిర్దేశిత కాలవ్యవధిలో పనుల నిర్మాణం జరగాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు. ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ఎవరికి ఇబ్బంది కలుగకుండ నిర్మాణ పనులను చేపట్టాలన్నారు. సాంకేతికపరమైన అంశాల్లో ఐఐటి, జేఎన్టీయూ నుంచి తగిన సహకారం తీసుకోవాలని శ్రీధర్ బాబు సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులకు ఆటంకాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పని సరిగా పాటించేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. మూసీ పునర్జీవం ప్రాజెక్టులో భాగంగా నదిలో పలు చోట్ల చెక్ డ్యాంల తరహాలో రబ్బర్ డ్యాంలను ఏర్పాటు చేయనున్నారు. నీటి నిల్వను పెంచడంతో పాటు జల క్రీడలు, బోటింగ్ సదుపాయాలతో టూరిజం స్పాట్‌లుగా తీర్చిదిద్దేలా ప్రణాళిక చేసినట్లు అధికారులు వివరించారు. ఒబెర్‌మెయర్ స్పిల్‌వే గేట్ టెక్నాలజీ సంస్థ రూపొందించిన రబ్బర్ డ్యాం నమూనాను ప్రజా భవన్ లో మంత్రులు పరిశీలించారు. నాసిక్, ముంబయి నగరాల్లో ఈ సంస్థ నిర్మించిన రబ్బర్ డ్యాంలను అధ్యయనం చేయాలని అధికారులకు మంత్రులు తెలిపారు.మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు కేవలం ఒక నది ప్రక్షాళన మాత్రమే కాదని ఒక సామాజిక బాధ్యత అని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి అంటే మనుషులను దూరం చేయడం కాదని వారిని భాగస్వాములను చేయడమేనని పేర్కొంది. మూసీ ప్రాజెక్టును అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది. ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసి విశ్వసనీయత కల్పించేలా కార్యచరణ ఉండాలని సబ్ కమిటీ ఆదేశించింది.ప్రజా ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత తెలిపింది. ప్రజల ఆస్తులు, నిర్మాణాలపై అతి తక్కువ ప్రభావం పడేలా ఆలైన్ మెంట్‌ను మార్చుకోవాలని మంత్రివర్గ ఉపసంఘం సూచించింది. అత్యంత జాగ్రత్తగా ప్రణాళికలు రూపొందించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రాజెక్టు పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించింది. నగర రూపురేఖలు మారడమే కాకుండా పరీవాహక ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని, ప్రజల భాగస్వామ్యంతోనే మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు సాకారం అవుతుందని దిశానిర్దేశం చేసింది. అభివృద్ధి, ప్రజా హితం రెండూ సమాంతరంగా సాగాలని కేబినెట్ సబ్ కమిటి అధికారులకు స్పష్టం చేసింది.

# తనూజ హత్య కేసులో కీలక అప్ డేట్

మొదటి పేజీ తరువాయి

చెప్పారు.

తనూజ మృతదేహానికి పోస్ట్‌మార్టం పూర్తి..

వినయ్ రంజన్ రే భార్య తనూజ మృతదేహానికి ఇప్పటికే పోస్ట్‌మార్టం పూర్తయింది. ప్రశాసన్ నగర్‌లోని ఐపీఎస్ అధికారి నివాసానికి ఆమె మృతదేహాన్ని తరలించారు. గురువారం రాత్రి రెండు గంటలకు ఇంట్లోకి చొరబడి తనుజను హత్య చేసిన నిందితులు నగదుతో పరారయ్యారు. వినయ్ రంజన్ నివాసంలో పని చేసే నేపాల్‌కు చెందిన కల్పన ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా పోలీసులు ఇప్పటికే గుర్తించారు. ఇంట్లో వినయ్ రంజన్ లేకపోవడంతో బయట నుంచి మరో ముగ్గురిని కల్పన పిలిపించి.. ఈ హత్యను చేసినట్లు పోలీసులు కనుగొన్నారు.

ఆటోలో నాంపల్లి రైల్వే స్టేషన్‌కు..

తనూజను బంధించడానికి తమతో పాటే నిందితులు క్లాత్ తెచ్చుకున్నారు. ఈ దోపిడి అనంతరం ఇంటి వెనుక భాగంలోని పార్క్ నుంచి వారంతా పరారయ్యారు. ఈ దోపిడి తర్వాత వారంతా ఆటోలో నాంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నట్లు సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా గుర్తించారు. అక్కడి నుంచి ఢిల్లీకి వెళ్లే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలులో నిందితులు వెళ్లినట్లు పరిశీలనలో తేలింది. ఇంకో వైపు రెండు పోలీస్ బృందాలు ఇప్పటికే నేపాల్‌కు బయలుదేరి వెళ్లాయి. కల్పన అండ్ గ్యాంగ్ కదలికలపై పోలీసులు నిఘా ఉంచారు.

# చిట్కుల్ 6, 7 వార్డుల్లో ప్రజా సమస్యలపై చైర్‌పర్సన్ పరిశీలన

**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08 :** ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ గ్రామంలోని 6 మరియు 7వ వార్డుల్లో ఉన్న ప్రజా సమస్యలను మున్సిపల్ చైర్‌పర్సన్ మోటే సుమలత శ్రీకాంత్ సమగ్రంగా పరిశీలించారు. శుక్రవారం స్థానిక ప్రజలతో ప్రత్యక్ష సమావేశమై, వారి సమస్యలను తెలుసుకున్నారు.

**డ్రైనేజ్, తాగునీరు, రోడ్ల సమస్యలు:**
సమావేశంలో ప్రజలు డ్రైనేజ్ వ్యవస్థలో లోపాలు, తాగునీటి సరఫరాలో అక్రమాలు, రోడ్లు దెబ్బతినడం వంటి ముఖ్య సమస్యలను వెల్లడించారు. వర్షాల సమయంలో నీటి నిల్వలు, కాలుష్యం, తాగునీటి కొరత వంటి అంశాలపై తీవ్రంగా ఫిర్యాదు చేశారు. రోడ్లు పగిలే పరిస్థితి వల్ల ప్రయాణదారులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

**త్వరిత పరిష్కారానికి హామీ:**
సంబంధిత వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యుల సాంగత్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. "ప్రజల సమస్యలు మా ముఖ్య ఆత్మీయత. అవసరమైన నిధులు, చర్యలతో త్వరలోనే పరిష్కారం కల్పిస్తాం" అని హామీ ఇచ్చారు. కౌన్సిలర్లు తమ సహకారం అందించారు.

**స్థానిక ప్రజల ఆశలు:**
ఈ సమీక్ష ప్రజల్లో సానుకూల అభిప్రాయాన్ని రేకెత్తించింది. మున్సిపాలిటీ చైర్‌పర్సన్ నాయకత్వంలో గ్రామీణ సమస్యల పరిష్కారానికి కొత్త ఉత్సాహం కనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు.



# పెంచిన ఆయిల్ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరలను తగ్గించాలి

**సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకరి సత్యం**

**హైదరాబాద్ పల్స్, లక్షెట్టిపేట, మే 08 :** కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఆయిల్ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరల పెంపును తక్షణమే తగ్గించాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శంకర్ సత్యం శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వలన రాష్ట్రంపై రోజుకు రూ.2.28 కోట్లు భారం పడుతుందన్నారు. అదేవిధంగా ప్రజలు, వినియోగదారులు, హోటళ్ల యాజమాన్యాలు పెరిగిన ఆయిల్ కమర్షియల్ సిలిండర్ల ధరలతో బెంబేలెత్తుతున్నారని అన్నారు. ఓ కప్పు కాఫీ తాగటానికి సామాన్యుడు వెనుకాడుతుంటే.. రూ.20 ఉన్న అదే కప్పు కాఫీని రూ.30కి అమ్మలేక హోటల్ యాజమాన్యాలు దిగులుపడుతున్నారని అన్నారు. ప్రజలు ఏం తినలేని పరిస్థితి నెలకొందని,యుద్ధం వల్ల సిలిండర్ల కొరత ఏర్పడటంతో కమర్షియల్ గ్యాస్ ధరను ఇప్పటికే రెండుసార్లు పెంచిన కేంద్రం.. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి రూ.993, పేద ప్రజలపై వడ్డించిందన్నారు. దీంతో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా పరిస్థితి తయారైంది. పెరిగిన ధరల వల్ల చిన్న పరిశ్రమలు, ప్రయివేటు హాస్టల్స్, టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఆయా సంస్థల్లో నడుస్తున్న క్యాంటీన్ల నిర్వహణ మరింత భారం కానుందన్నారు. ఇప్పటికే జిల్లాల్లోనూ చాలా హోటళ్లు మూతపడ్డాయని, అంతేకాకుండా కమర్షియల్ సిలిండర్ల ధరలు పెంచడం వల్ల టిఫిన్, భోజనం ఖర్చులు భారీగా పెరిగాయని, అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్ పై యుద్ధానికి కొద్ది రోజుల ముందే ఈ ఏడాది మార్చిలో మోడీ సర్కార్ వాణిజ్య సిలిండర్ ధరపై రూ.115, ఏప్రిల్‌లో రూ.195 వడ్డించిందని ఇప్పుడు మూడోసారి ఏకంగా రూ.993 పెంచి ఈ రాష్ట్ర ప్రజలకు మరింత షాక్ ఇచ్చిందన్నారు. ఇలా రెండు నెలల వ్యవధిలోనే ఏకంగా రూ.1,303 పెంచటంతో ఇటు వినియోగదారులు, అటు చిన్న వ్యాపారులు లబోదిబోమంటున్నార తాజా పెంపుదలతో ప్రస్తుతం వాణిజ్య సిలిండర్ ధర రూ. 3,315కు ఎగబాకింది. యుద్ధం పేరిట గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు, సిబ్బంది, ఏజెన్సీలు, అధికారులు కలిసి రూ. 2,100 ధర ఉన్న సిలిండర్‌ను ఏకంగా రూ.3500, రూ4500, రూ. 5వేల వరకు బ్లాక్‌లో అమ్ముకుంటూన్నారు. దీని ఫలితంగా టిఫిన్స్, భోజనం, ధరలు పెరగడంతో వినియోగదారులపై తీవ్ర భారాలు పడ్డాయి. రూ.10 ఉన్న కప్పు టీ ధర రూ.15, రూ.20కి పెరిగింది. రూ.30 ఉన్న ప్లేట్ టిఫిన్ ధర రూ.40 నుంచి రూ.50కి పెరిగి, సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.




# విద్యార్థుల ఘన విజయంతో నెరవేరిన భక్తి మొక్కు

**కొరవి వీరభద్ర స్వామికి తలనీలాలు సమర్పించిన బ్రిలియంట్ హై స్కూల్ ఉపాధ్యాయుడు శ్రీనివాస్**

**హైదరాబాద్ పల్స్, మే 8, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** డోర్నకల్ మండలంలో విద్యా రంగంలో మరోసారి బ్రిలియంట్ హై స్కూల్ తన ప్రత్యేకతను చాటుకుంది. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మండల స్థాయిలో సత్తా చాటారు. 600 మార్కులకు గాను 580 మార్కులు సాధించి మండల ఫస్ట్ స్థాయిలో నిలవడం పాఠశాల ప్రతిష్టను మరింత పెంచింది. ఈ విజయంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు కూడా పట్టుదల, క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వంతో ఉన్నత ఫలితాలు సాధించగలరని బ్రిలియంట్ హై స్కూల్ విద్యార్థులు మరోసారి నిరూపించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన బోధన, ప్రత్యేక శిక్షణ, పరీక్షలపై అవగాహన కార్యక్రమాలు ఈ ఫలితాలకు ప్రధాన కారణమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తే కొరవి వీరభద్ర స్వామికి తలనీలాలు సమర్పిస్తానని పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్ ముందుగా మొక్కుకున్నారు. విద్యార్థులు ఆశించిన దానికంటే మెరుగైన ఫలితాలు సాధించడంతో తన మొక్కును శుక్రవారం భక్తిశ్రద్ధలతో నెరవేర్చుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి కొరవి వీరభద్ర స్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి తలనీలాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల కష్టపడి చదివే తత్వం, తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల సమిష్టి కృషి వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని కోరుకుంటూ స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు. బ్రిలియంట్ హై స్కూల్ సాధించిన ఫలితాలపై స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యావేత్తలు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ నాణ్యమైన విద్య అందిస్తే విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ రాణించగలరని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. పాఠశాల మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



# సంక్షోభంలో ప్రపంచం.. భారత్ రూటు మాత్రం సపరేటు!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, సెంట్రల్ డెస్క్:** పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు ఇప్పుడు భారత ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపడం ప్రారంభించాయి. ముఖ్యంగా ముడి చమురు ధరలు పెరగడం, వాణిజ్య మార్గాల్లో అంతరాయాలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ వంటి పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అయినప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలమైన దేశీయ డిమాండ్, స్థిరమైన బ్యాంకింగ్ వ్యవస్థ, ప్రభుత్వ విధానాల మద్దతుతో ఇప్పటికీ స్థిరంగా ఉందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజా నివేదిక పేర్కొంది. ఈ సంక్షోభం ప్రభావం ప్రధానంగా ఇంధన దిగుమతులు, సరఫరా గొలుసులు, ఎగుమతులు, ద్రవ్యోల్బణంపై కనిపిస్తోంది. ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 110 డాలర్లకు చేరువ కావడంతో దిగుమతి బిల్లు పెరిగే ప్రమాదం ఉంది. దీని ప్రభావం భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ ధరలపై పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ధరలను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, దీర్ఘకాలంలో ఇది సవాలుగా మారవచ్చని భావిస్తున్నారు. ఇక మధ్యప్రాచ్య దేశాలకు భారత ఎగుమతులపై కూడా ప్రభావం పడుతోంది. రవాణా ఖర్చులు పెరగడం, సరుకు రవాణాలో జాప్యాలు ఏర్పడడం వల్ల తయారీ రంగం ఒత్తిడిని ఎదుర్కొంటోంది. కొన్ని పరిశ్రమలు ఇప్పటికే ముడి పదార్థాల కొరతను ఎదుర్కొంటున్నాయి. విదేశీ పెట్టుబడుల పరంగా కూడా ఒత్తిడి కనిపిస్తోంది. 2026 ప్రారంభ నెలల్లో విదేశీ పెట్టుబడిదారులు భారీ మొత్తంలో పెట్టుబడులను ఉపసంహరించుకున్నప్పటికీ, దేశీయ పెట్టుబడిదారులు మార్కెట్‌ను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించారు. అయితే భారతదేశానికి కొన్ని బలమైన అంశాలు మద్దతుగా నిలుస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో పెద్ద భాగం దేశీయ వినియోగంపై ఆధారపడి ఉండటం, బ్యాంకుల ఆర్థిక స్థితి మెరుగ్గా ఉండటం, భారీ విదేశీ మారక నిల్వలు, సేవల ఎగుమతుల వృద్ధి వంటి అంశాలు ప్రస్తుతం రక్షణ కవచంలా పనిచేస్తున్నాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ సంక్షోభం భారత్‌కు ఒక హెచ్చరిక వంటిది. భవిష్యత్తులో ఇంధన దిగుమతులపై ఆధారాన్ని తగ్గించి, పునరుత్పాదక ఇంధన వనరులను వేగంగా అభివృద్ధి చేయడం అత్యవసరమని వారు సూచిస్తున్నారు.




# ఒక లక్ష 50 వేల రూపాయల విలువైన ఎల్‌ఓసి పంపిణీ : ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08 :** ఆపత్కాల సమయంలో నిరుపేదలకు ఆపన్న హస్తం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రాపురం ఎస్ ఎన్ కాలనీకి చెందిన నగారిగారి మరియమ్మ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో మెరుగైన చికిత్స కోసం ఎమ్మెల్యే జిఎంఆర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుండి మంజూరైన ఒక లక్ష 50 వేల రూపాయల విలువైన ఎల్‌ఓసి పత్రాలను శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో రామేశ్వరంబండ కౌన్సిలర్ అంతి రెడ్డి పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్ పేపర్ మిల్లును సందర్శించిన మంత్రి జూపల్లి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం కాగజ్‌నగర్‌లోని పేపర్ మిల్లును సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లుసిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం మిల్లులోని వివిధ విభాగాలను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. కలప నుంచి కాగితం తయారయ్యే వివిధ దశలను మంత్రి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కలపను ముక్కలుగా చేయడం (చిప్పింగ్), ఆపై గుజ్జుగా మార్చడం, రసాయనాల వినియోగం నుంచి తుది దశలో పేపర్ రోల్స్ సిద్ధమయ్యే వరకు సాగే సంక్లిష్ట ప్రక్రియను, యంత్రాల పనితీరును మిల్లు సాంకేతిక నిపుణులు వివరించారు. ఉత్పత్తి, కార్మికుల సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె హరిత ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, తదితరులు పాల్గొన్నారు



# తుమ్మిడి హెట్టి ప్రాణహిత ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని తుమ్మిడి హెట్టి గ్రామం వద్ద నిర్మించబోయే ప్రాణహిత బ్యారేజ్ స్థలాన్ని పరిశీలించిన మంత్రులు జూపల్లి కృష్ణారావు మరియు వివేక్ వెంకటస్వామి. ప్రాజెక్టు స్థలాన్ని పరిశీలించడంతో పాటు ప్రాజెక్టు యొక్క ఎత్తు మరియు కాల్వల సామర్థ్యం గురించి ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తుమ్మిడి హెట్టి పుష్కర ఘాట్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పత్రికా విలేకరుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కి తెలంగాణ ప్రభుత్వం తరపున ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి లేఖ రాశారని, వచ్చేవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రితో భేటీ అయి బ్యారేజ్ యొక్క ఎత్తును నిర్ధారిస్తామని తెలిపారు. మహారాష్ట్రలో ముంపు ప్రాంతాలకు నష్టపరిహారం ఇచ్చి అక్కడి రైతులను ఆదుకుంటామని తెలిపారు. కెసిఆర్ ప్రభుత్వం మోసపూరితంగా ఈ ప్రాజెక్టును మేడిగడ్డకు తరలించి తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్, బెల్లంపల్లి శాసనసభ్యులు జి. వినోద్, కలెక్టర్ హరిత, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అడిషనల్ కలెక్టర్ డేవిడ్, ఇరిగేషన్ అధికారులు డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ మరియు తదితరులు పాల్గొన్నారు.





# సిర్పూర్ నియోజకవర్గంలో పోడు రైతుల కమిటీ ఏర్పాటు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు పోడు రైతుల కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడు గోమాసె లాంచ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.పోడు భూముల సమస్యల పరిష్కారం, రైతుల హక్కుల పరిరక్షణ కోసం కమిటీ పనిచేస్తుందని నాయకులు తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా దుర్గం బాపురావు, కార్యదర్శిగా తోటపల్లి నారాయణను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోలేం వెంకటేశం, సిర్పూర్ నియోజకవర్గ యూత్ కన్వీనర్ కాసిపాక రాజు, కార్జెల్లీ గ్రామ పార్టీ అధ్యక్షుడు రౌతు శేఖర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రాజెక్టులపై శ్రద్ధ... పోడు భూముల సమస్యపై మౌనమా?



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రాణహిత ప్రాజెక్టు పర్యటనలతో రాజకీయ సందడి కొనసాగుతున్నప్పటికీ, పోడు భూముల సమస్య మాత్రం ఇంకా పరిష్కారానికి నోచుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట, సిర్పూర్(టి) మండలాల్లో వేల ఎకరాల పోడు భూములు సాగులో ఉన్నా, పట్టాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పట్టాలు లేకపోవడంతో రైతుబంధు, రైతు భరోసా వంటి పథకాల ప్రయోజనాలు అందకపోవడంతో పాటు బ్యాంకు రుణాలు కూడా దక్కడం లేదని రైతులు చెబుతున్నారు. మరోవైపు అటవీ శాఖ ఆంక్షలు, కేసులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయని పేర్కొంటున్నారు. ప్రాణహిత ప్రాజెక్టుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లే, తరతరాలుగా సాగు చేస్తున్న పోడు భూముల సమస్య పరిష్కారంపైనా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి

# కాగజ్ నగర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అదనంగా రూ.20 కోట్లు కేటాయించండి

**ఇన్చార్జ్ మంత్రిని కోరిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08 :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో ప్రజా పాలన ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఎస్పియం క్లబ్లో ఈ రోజు 270 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు పత్రాలను అందజేసేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు ని కాగజ్ నగర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అదనంగా రూ.20 కోట్లు కేటాయించాలని సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు కోరారు.కాగజ్ నగర్ పట్టణంలోని ప్రధాన రహదారుల వెడల్పు చేసే కార్యక్రమం చేపడుతున్నామని, దానికి అనుగుణంగా సైడ్ డ్రైన్లు 7మరియు సీసీ రోడ్ల నిర్మాణం కోసం అదనపు నిధులు అవసరం అవుతున్నాయని తెలిపారు. కాగజ్ నగర్ మున్సిపాలిటీకి అదనంగా ఈ సంవత్సరం 500 ఇండ్లు కేటాయించాలని కోరారు. సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికుల సమస్యను పరిష్కరించి, గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్సీ దండే విఠల్, మునిసిపల్ చైర్మన్ షాహీన్ సుల్తానా, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, మునిసిపల్ కమిషనర్, మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వైభవంగా

## వేణుగోపాలస్వామి రథోత్సవం





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, సిద్దిపేట జిల్లా:** వర్గల్ వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున స్వామి వారి విమాన రథోత్సవం అత్యంత వైభవంగా ఘనంగా జరిగింది. ఉదయాన్నే రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన విమాన రథంపై అధిష్టింపజేసి వర్గల్ పురవీధుల్లో వివరింప చేశారు. స్వామివారి విమానారదోత్సవములు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి రథోత్సవ వేడుకను తిలకించి పునీతులైనారు. భక్తులకు ఆలయనిర్వాకులు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాదాలను అందజేశారు.

# విద్యుత్ ఘాతానికి గురై పాడి గేదెలు మృతి





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08,** భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలోని చర్ల మండలంలోని మొగళ్లపల్లి గ్రామంలోని పంట పొలాల్లో విద్యుత్ షాక్ కు గురై ఎంబడి హరినాథ్ అనే రైతుకు చెందిన మూడు పాడి గేదెలు మృతి చెందాయి. గత రాత్రి వచ్చిన గాలివాన బీభత్సానికి కరెంటు ఫోల్ కు ఉన్న విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మేత కోసం వెళ్ళిన మూగజీవాలు కరెంటు వైర్లకు తాకడంతో విద్యుత్ షాక్ కు గురైన గేదెలు మూడు అక్కడికక్కడే మృతి చెందాయి.గేదెలపై ఆధారపడి జీవనం గడుపుతున్నామని, వీటి విలువ దాదాపు మూడు లక్షల 60 వేల రూపాయలు ఉంటుందని ఈ ప్రమాదంపై విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు హరినాథ్ వేడుకుంటున్నాడు.

# ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్ల సహకారం తప్పనిసరి: కలెక్టర్ ప్రతీక్ జైన్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, సంగారెడ్డి ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా, వేగవంతంగా నిర్వహించేందుకు రైస్ మిల్లర్లు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ మేరకు సూచనలు చేశారు. ప్రస్తుతం జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు చేరుతున్న ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని, ఆలస్యం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మిల్లర్లు అవసరానికి అనుగుణంగా ఎక్కువ సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని, ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా చూడాలని తెలిపారు.రైతులు ధాన్యం విక్రయానికి వచ్చినప్పుడు నిరీక్షణ లేకుండా త్వరితగతిన ప్రక్రియ పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, మిల్లర్లు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్లు తమకు ఎదురవుతున్న పలు సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ టి.ఎల్. సంగీత, జిల్లా పౌర సరఫరాల అధికారి, సివిల్ సప్లై డీఎం, డిసిఓ, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఆశయాల కోసం పనిచేస్తాం..!

**జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్**

**అనసూయమ్మకు ఘన నివాళులు**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, ఝరాసంగం :** వేదభక్తి, దైవభక్తిని ప్రజల్లో పెంపొందించిన బర్దిపూర్ మాతృమూర్తి మాతృశ్రీ అనసూయ మాత ఆశయాల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్ అన్నారు. శుక్రవారం జహీరాబాద్ బీజేపీ నాయకులతో కలిసి బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఇటీవల శివైక్యం చెందిన మాతృమూర్తి అనసూయ మాత సమాధి స్థలమైన ఆనంద మండపాన్ని దర్శించుకుని పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి, సిద్దేశ్వరనంద్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించిన అమ్మ మన మధ్య లేకపోవడం ఎంతో బాధాకరమన్నారు. అమ్మ చూపిన మార్గాన్ని కొనసాగిస్తూ, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు తాము పూర్తి స్థాయిలో సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గొల్ల భాస్కర్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు మోహన్ రెడ్డి, పండరినాథ్, ఉత్సవ కమిటీ సభ్యులు రమేష్ పాటిల్, కోట శ్రీనివాస్, బీ. కృష్ణ, వడ్ల సంగమేశ్వర్, బోయి ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మకు శ్రద్ధాంజలి అర్పించారు.

# గిరిజన విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

**టీడబ్ల్యూ సమ్మర్ గేమ్స్ క్యాంప్ ముగింపు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో గిరిజన సంక్షేమ శాఖ నిర్వహించిన 15 రోజుల టీడబ్ల్యూ సమ్మర్ గేమ్స్ ఒ స్పోర్ట్స్ క్యాంప్ శు క్రవారం విజయవంతంగా ముగిసింది. ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ (గిరిజన సంక్షేమం) రమాదేవి పాల్గొన్నారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడా చురుకుగా పాల్గొనాలని రమాదేవి స్పష్టం చేశారు. క్రీడలు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టుభావన, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. క్యాంప్‌ను విజయవంతంగా నడిపించిన ఫిజికల్ డైరెక్టర్లు, పి ఇ టి లు, కోచ్‌లు, ఉపాధ్యాయులు, సిబ్బందిని అధికారులు అభినందించారు. విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, షూలు అందజేశారు.కార్యక్రమంలో ఎ సి ఎం ఓ ఉద్ధవ్, స్పోర్ట్స్ ఆఫీసర్ షేకూ, హెడ్‌మాస్టర్ లింభారావ్, జి సి డి ఓ శకుంతల, హెచ్‌డబ్ల్యూఓ సాయిబాబా, పి డి లు కనక వెంకటేశ్వర్లు, మంగావతి, కృష్ణమూర్తి, కోచ్‌లు అరవింద్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# భట్టుపల్లి - జీడిచేను బిటి రోడ్డు సమస్యపై మంత్రి జూపల్లికి విన్నవించిన సర్పంచ్ రాజేందర్ జాదవ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిది:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని భట్టుపల్లి గ్రామంలో నెలకొని ఉన్న పలు సమస్యల పరిష్కారం కోసం సర్పంచ్ రాజేందర్ జాదవ్ నేడు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

-బిటి రోడ్డు నిర్మాణం: భట్టుపల్లి ట్రాన్స్‌ఫార్మర్ నుండి జీడిచేను వాటర్ ట్యాంక్ వరకు పూర్తిగా దెబ్బతిన్న రోడ్డును పునర్నిర్మించాలి.

-డ్రైనేజీ వ్యవస్థ: ధ్వంసమైన డ్రైనేజీ కాలువలను పునరుద్ధరించాలి.

-ప్రజల ఇబ్బందులు: రోడ్ల దుస్థితి కారణంగా రైతులు, విద్యార్థులు నిత్యం పడుతున్న అవస్థలను మంత్రికి వివరించారు.

వీటిపై సానుకూలంగా స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు మరియు ఎమ్మెల్సీ దండే విఠల్ , వెంటనే నిధులు మంజూరు చేసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు మారిశెట్టి రాజేష్, పర్వతి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అధికార అండతో అక్రమ నిర్మాణం..?

- జి౦1 అనుమతితో జి౦2 నిర్మాణం
- ప్రభుత్వ ఆదాయానికి గండి..?
- చర్యలు తీసుకోవడంలో వెనుకాడుతున్న అధికారులు..!
- "జి౦2 నిర్మాణానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదు"
- కొత్తూరు (సి) మాజీ పంచాయతీ కార్యదర్శి అశోక్



**హైదరాబాద్ పల్స్, మే 08, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం కొత్తూరు (సి) గ్రామ పంచాయతీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఓ భవన నిర్మాణం ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీసింది. కందికొండ స్టేజి సమీపంలో అధికార పార్టీ అండదండలతో ఓ కాంగ్రెస్ నాయకుడు అక్రమంగా అదనపు అంతస్తు నిర్మాణం చేపడుతున్నాడన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.స్థానికుల కథనం ప్రకారం, సంబంధిత వ్యక్తి గ్రామ పంచాయతీ నుంచి కేవలం గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తు (జి౦1) నిర్మాణానికి మాత్రమే అనుమతి పొందినప్పటికీ, ప్రస్తుతం రెండవ అంతస్తు (జి౦2) నిర్మాణాన్ని కూడా యథేచ్ఛగా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. అదనపు అంతస్తు నిర్మించాలంటే మళ్లీ ప్రత్యేక అనుమతులు తీసుకోవాల్సి ఉండగా, ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే నిర్మాణం కొనసాగుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

**నిబంధనలు పక్కనబెట్టి నిర్మాణం..?**

గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం అనుమతి పొందిన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణం చేపడితే అదనపు ఫీజులు, పన్నులు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ నిర్మాణంలో ఆ నిబంధనలు పూర్తిగా పక్కనబెట్టబడ్డాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉండటంతోనే సంబంధిత వ్యక్తి ధైర్యంగా అక్రమ నిర్మాణం కొనసాగిస్తున్నాడని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

**అధికారుల పొంతన లేని సమాధానాలు:**

ఈ వ్యవహారంపై ప్రస్తుత గ్రామ పంచాయతీ కార్యదర్శి పాషాను వివరణ కోరగా, "ఈ భవనానికి అనుమతులు గత కార్యదర్శి హయాంలోనే మంజూరయ్యాయి. పూర్తి వివరాలు వారికే తెలుస్తాయి" అంటూ బాధ్యతను పక్కకు నెట్టే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది.అయితే గత కార్యదర్శి అశోక్ స్పందిస్తూ, "తాను కేవలం జి౦1 నిర్మాణానికే అనుమతి ఇచ్చానని, జి౦2 నిర్మాణానికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని" స్పష్టం చేశారు. దీంతో ప్రస్తుత నిర్మాణం పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా సాగుతోందన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి.

**రాజకీయ ఒత్తిళ్లతోనే మౌనమా..?**

గ్రామంలో అందరికీ కనిపించేలా భారీగా నిర్మాణం జరుగుతున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సాధారణ ప్రజలు చిన్నచిన్న నిబంధనల ఉల్లంఘనలకు గురైతే వెంటనే నోటీసులు జారీ చేసే అధికారులు, ఈ విషయంలో మాత్రం మౌనం పాటించడం విమర్శలకు తావిస్తోంది.

**ప్రభుత్వ ఆదాయానికి నష్టం..?**

అనుమతి లేకుండా అదనపు అంతస్తులు నిర్మించడం వల్ల గ్రామ పంచాయతీకి రావాల్సిన ఫీజులు, అభివృద్ధి ఛార్జీలు, పన్నులు ప్రభుత్వ ఖజానాకు చేరకుండా పోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి అక్రమ నిర్మాణాలను అడ్డుకోకపోతే భవిష్యత్తులో మరింత మంది నిబంధనలను ధిక్కరించే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

**విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్**

ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం కొనసాగుతున్నట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వ ఆదాయాన్ని రక్షించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# మీలా డ్రగ్స్ తీసుకోవడం నాకు తెలియదు

## : కేటీఆర్‌కు బండి సంజయ్ కౌంటర్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, మెయిన్ డెస్క్:** బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌లా దోచుకోవడం.. దాచుకోవడం తమకు తెలియదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు బేడీలు వేసి అరిగోస పెట్టించారని అన్నారు. అలా హింసించడం తనకు తెలియదని వెల్లడించారు. అంతేకాదు.. మీలా డ్రగ్స్ తీసుకోవడం తనకు తెలియదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం, ఫార్ములా ఈరేస్ కేసు, విద్యుత్ కొనుగోళ్లలో అవినీతి చేయడం కూడా తెలియదని హాట్ కామెంట్స్ చేశారు. ఇకనైనా కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని.. లేకపోతే పరిస్థితులు వేరేలా ఉంటాయని బండి సంజయ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఈ అహంకారం వల్లే కేసీఆర్ ఓడిపోయి ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారని తెలిపారు. వరుస ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతున్నా కూడా కేటీఆర్‌లో మార్పు రావడం లేదని.. ఇంకా అదే అహంకారం కనిపిస్తుందని విమర్శించారు.

**ఢిల్లీ నుండి మేం నిధులు తెస్తుంటే..**

ఈనెల 10న పరేడ్ గ్రౌండ్‌లో జరగబోయే ప్రధాని మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. 'తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం రూ.వేల కోట్ల నిధులిస్తోంది. కేంద్ర నిధులతోనే తెలంగాణలో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతోంది. కేంద్రం నిధులివ్వకపోతే తెలంగాణ అభివృద్ధి చెందే అవకాశమే లేదు. ఢిల్లీ నుండి మేం నిధులు తెస్తుంటే.. కాంగ్రెసోళ్లు తెలంగాణ సొమ్మును ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు పంపుతున్నారు. కాంగ్రెస్ పార్టీని నడుపుకోవడానికి తెలంగాణ సొమ్మును వాడుకుంటున్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తెలంగాణ మరింత అభివృద్ధి సాధ్యం. తెలంగాణ ప్రజల ఆశీర్వాదం కోసం మోడీ వస్తున్నారు. తెలంగాణను అభివృద్ధి చేయడమే మోడీ నినాదం' అని బండి సంజయ్ పేర్కొన్నారు.

# ఎట్టకేలకు చిక్కిన (నాసిక్ టీసీఎస్) లేడీ డాన్ నిదా ఖాన్!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, సెంట్రల్ డెస్క్ :** మహారాష్ట్ర నాసిక్‌లోని టీసీఎస్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా కంపెనీ మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు, బలవంతపు



మతమార్పిడులు, మానసిక హింసకు పాల్పడినట్లు నమోదైన సంచలన కేసులో మహారాష్ట్ర పోలీసులు కీలక విజయం సాధించారు. గత కొంతకాలంగా పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్న ఈ కేసులోని ప్రధాన నిందితురాలు నిదా ఖాన్‌ను ఛత్రపతి సంభాజీనగర్‌లో ఎట్టకేలకు అరెస్టు చేశారు.నాసిక్ క్రైమ్ బ్రాంచ్, ఛత్రపతి సంభాజీనగర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో, సంభాజీనగర్‌లోని కౌసర్ పార్క్ ప్రాంతంలో నిదా ఖాన్ ఉన్నట్లు పక్కా సమాచారం అందింది. గురువారం (మే 07) రాత్రి పోలీసులు ఆ ప్రాంతంపై ఆకస్మిక దాడి చేసి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. తన గుర్తింపును దాచిపెట్టి, అత్యంత రహస్యంగా ఒక ఇంట్లో నివసిస్తున్న నిదాను పట్టుకున్నారు పోలీసులు. వెంటనే ఆమెను విచారణ నిమిత్తం నాసిక్‌కు తరలించారు.నిదా ఖాన్ తలదాచుకున్న ఇంటి వివరాలు ఇప్పుడు వెలుగులోకి వచ్చాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఆమె ఉన్న ఇల్లు గత కొన్ని నెలలుగా ఖాళీగానే ఉంది. ఆ ప్రాంత నివాసితులు ఒకరి విషయాల్లో మరొకరు జోక్యం చేసుకోని పరిస్థితిని ఆసరాగా చేసుకుని ఆమె అక్కడ దాక్కుంది. ఆ ఇంటి తలుపులు ఎప్పుడూ మూసే ఉండేవని, కేవలం ఒక వృద్ధుడు మాత్రమే నిత్యావసరాల కోసం బయటకు వచ్చి వెళ్తుండేవాడని పొరుగువారు తెలిపారు. నిదా ఖాన్ గత నాలుగు ఐదు రోజులుగానే ఆ ఇంట్లో ఉంటున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.నాసిక్ టీసీఎస్ కార్యాలయంలో పని చేస్తున్న పలువురు మహిళా ఉద్యోగులు తమపై జరుగుతున్న అరాచకాలను ధైర్యంగా బయటపెట్టడంతో ఈ దారుణం వెలుగు చూసింది. నిందితులు మహిళా ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని లైంగిక వేధింపులకు గురిచేయడం, మతమార్పిడి చేసుకోవాలని తీవ్రంగా ఒత్తిడి తీసుకురావడం, మతపరమైన మనోభావాలను దెబ్బతీస్తూ మానసిక హింస పెట్టడం వంటి చర్యలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ వ్యవహారంపై ఇప్పటికే తొమ్మిది ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణను వేగవంతం చేసింది. నిదా ఖాన్ అరెస్టుతో ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న ఇతర పెద్దల పేర్లు, అనుబంధ సంస్థల వివరాలు బయటకు వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. ఆమెకు ఆశ్రయం కల్పించిన వారిని, ఈ రాకెట్‌లో భాగస్వాములైన మరికొందరిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని కీలక అరెస్టులు జరిగే అవకాశం ఉంది.

## బీసీ ఇంటలెక్చువల్స్, పొలిటికల్ ఫ్రంట్ ఫోరం

# ఆధ్వర్యంలో ప్రధాని మోడీకి బహిరంగ లేఖ



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : మూడవసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి తెలంగాణ పర్యటనకు వస్తున్న నరేంద్ర మోడీకి 10 డిమాండ్లతో బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టీ. చిరంజీవులు మరియు బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగొని బలరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో బహిరంగ లేఖ రాయడం జరిగింది.

డిమాండ్స్

1) చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలి. 2) తెలంగాణలో 42% రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్లో చేర్చి అమలు చేయాలి. 3) జనగణనలో కులగణనను చేర్చి లెక్కించాలి. 4) బీసీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. 5) కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి. 6) బీసీ రక్షణ చట్టం చేయాలి. 7) ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ పునఃసమీక్షించాలి. 8) రోహిణి కమిషన్ అమలుచేయాలి. 9) ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి, క్రిమిలేయర్ రద్దుచేయాలి. 10) ఉన్నత న్యాయస్థానాల్లో బీసీలకు ప్రాతినిధ్యం ఉండాలి. ఈ సమావేశంలో ఫోరం, ఫ్రంట్ నాయకులు యర్రమాద వెంకన్న నేత, అయిలి వెంకన్న గౌడ్, అంబాల నారాయణ గౌడ్, బైరు శేఖర్, సింగం నాగేశ్వర్ గౌడ్, చెన్నా శ్రీకాంత్ బీసీ, జెల్ల నరేందర్ నేత, నరేష్, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికపై నీచానికి ఒడిగట్టిన చర్చి పాస్టర్.. గర్భం దాల్చడంతో అధిక మోతాదులో మందులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, మెయిన్ డెస్క్:** ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం కళ్లచెరువు గ్రామంలో అత్యంత అమానుష ఘటన వెలుగుచూసింది. స్థానిక చర్చిలో పాస్టర్‌గా పని చేస్తున్న చౌటపల్లి రాంబాబు (42) అనే వ్యక్తి, గత కొంతకాలంగా మైనర్ బాలికపై వరుసగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో బాలిక గర్భం దాల్చడంతో నిందితుడు రాంబాబు విషయాన్ని బయటకు పొక్కనీయకుండా బాలికతో మోతాదుకు మించి గర్భనిరోధక మాత్రలు మింగించాడు. దీంతో బాలిక ఆరోగ్యం తీవ్రంగా క్షీణించి, అధిక రక్తస్రావం కావడంతో ఒక్కసారిగా అస్వస్థతకు గురైంది. ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. వైద్యుల పరీక్షల్లో అసలు నిజం బయటపడింది.

**పాస్టర్ రాంబాబు అరెస్ట్**

తమ బిడ్డకు జరిగిన అన్యాయంపై బాధితురాలి తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడు పాస్టర్ రాంబాబును అదుపులోకి తీసుకున్నారు. పోక్సో చట్టంతో పాటు ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఒక పవిత్రమైన వృత్తిలో ఉంటూ ఇంతటి నీచానికి ఒడిగట్టిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ట్విస్ట్.. అరవింద్ కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, సెంట్రల్ డెస్క్:**
మద్యం పాలసీ కేసులో ఆమ్ ఆద్మీ చీఫ్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ మంత్రి మనీష్ సిసోడియా, దుర్గేష్ పాఠక్ దాఖలు చేసిన పిటిషన్లపై ఇవాళ ఢిల్లీ హైకోర్టులో కీలక చేపట్టింది. జస్టిస్ స్వర్ణ కాంత శర్మ నేతృత్వంలోని బెంచ్ విచారణకు హాజరయ్యేందుకు అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా నిరాకరించారు. సదురు బెంచ్ నుంచి తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని, అందుకే సత్యాగ్రహ మార్గంలో విచారణను బహిష్కరిస్తున్నట్లుగా వారు కోర్టుకు సమర్పించిన లేఖలో పేర్కొన్నారు.

**అమికస్ క్యూరీ నియామకం..**

నిందితులు ఎవరూ కోర్టుకు హాజరు కాకపోవడంతో, వారి తరఫున వాదనలు వినిపించేందుకు, న్యాయస్థానానికి సహాయపడేందుకు ముగ్గురు సీనియర్ న్యాయవాదులను 'అమికస్ క్యూరీ'లను నియమించాలని హైకోర్టు ధర్మాసనం నిర్ణయించింది. అయితే, గతంలో కేజ్రీవాల్, సిసోడియాను ఈ కేసు నుంచి విడుదల చేస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. దర్యాప్తు సంస్థపై గతంలో కోర్టు చేసిన ప్రతికూల వ్యాఖ్యలను తొలగించాలని ఈడీ కూడా కోరింది. దీంతో జస్టిస్ స్వర్ణ కాంత శర్మ బెంచ్ నుంచి తాను న్యాయం ఆశించడం లేదని కేజ్రీవాల్ అన్నారు. అందుకే స్వయంగా కానీ, నా న్యాయవాది ద్వారా కానీ ఈ విచారణలో పాల్గొనకూడదని నిర్ణయించుకున్నట్లుగా ఆయన కేజ్రీవాల్ స్పష్టం చేశారు. నిందితులు లేకపోయినా, అమికస్ క్యూరీల సహాయంతో ఈ కేసు విచారణను ముందుకు తీసుకెళ్లాలని హైకోర్టు భావిస్తోంది. ఈ మేరకు ఢిల్లీ మద్యం పాలసీ కేసు తదుపరి విచారణలో సీబీఐ, ఈడీ తమ వాదనలను వినిపించనున్నాయి

# సి.సి. కులకర్ణి రాజేష్ విధుల్లో చేరిక



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:** రాజపేట మండల సిసిగా విధులు నిర్వహిస్తున్న గౌరీ శంకర్ తుర్కపల్లి మండలానికి బదిలీ కాగా అదే సమయంలో కులకర్ణి రాజేష్ రాజపేట మండలానికి బదిలీ అయి శుక్రవారం విధుల్లో చేరారు. నియామక పత్రాన్ని ఏపీ ఎం.మురారి కి అందజేశారు.

# ఈ పాలు తాగితే పిల్లలు కూడా పుట్టరు.. వెరీ డేంజరస్

**అత్యాశకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది**

**నాలుగు లీటర్ల పాలు ఇచ్చే పశువు నుంచి బలవంతంగా పది లీటర్లు పిండాలనే స్వార్థం**

**నోరులేని జీవాల ప్రాణాల మీదకు తెస్తోంది**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, మెయిన్ డెస్క్:** అత్యాశకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. నాలుగు లీటర్ల పాలు ఇచ్చే పశువు నుంచి బలవంతంగా పది లీటర్లు పిండాలనే స్వార్థం నోరులేని జీవాల ప్రాణాల మీదకు తెస్తోంది. పశువుల్లో కృత్రిమంగా పాలను పెంచేందుకు వినియోగించే ప్రమాదకర ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లను తెలంగాణ రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి (డీసీఏ) అధికారులు పటాన్‌చెరువులో భారీగా పట్టుకున్నారు. పటాన్‌చెరువు ప్రాంతంలోని పశుగ్రాసం విక్రయ కేంద్రాలపై గురువారం, శుక్రవారం నిర్వహించిన దాడుల్లో ఈ అక్రమ నిల్వలను గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పటాన్‌చెరువులోని రెండు పశుగ్రాసం దుకాణాల్లో అధికారులు సోదాలు చేపట్టారు. పాటి ఎక్స్ రోడ్ వద్ద ఉన్న శ్రీ రేణుక క్యాటిల్ ఫీడ్ దుకాణంలో యజమాని ఆర్. సాయికృష్ణ గౌడ్ నుంచి లేబుల్ లేని 200 మి.లీ. పరిమాణం గల 40 ఆక్సిటోసిన్ బాటిళ్లను సీజ్ చేశారు. చైతన్య నగర్ కాలనీలో మైలారం సాయిరామ్ అనే వ్యక్తి నడుపుతున్న లక్ష్మి కృష్ణ క్యాటిల్ ఫీడ్ దుకాణంపై దాడి చేసి, 250 మి.లీ. పరిమాణం గల 120 బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



**ఈ పాలు అత్యంత ప్రమాదకరం..**

పాడి పశువుల నుంచి కృత్రిమంగా పాలను పితికేందుకు, పాల ఉత్పత్తిని పెంచేందుకు ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లను వినియోగిస్తున్నారు. దీనివల్ల పశువుల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని అధికారులు హెచ్చరించారు. ఆక్సిటోసిన్ ప్రయోగించిన పశువుల పాలు తాగడం వల్ల మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని అధికారులు హెచ్చరించారు. చిన్నపిల్లల్లో బాల్యదశలోనే శారీరక మార్పులు రావడం, హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుందని... పెద్దవారిలో కంటి చూపు మందగించడం, గర్భిణీ స్త్రీలలో గర్భస్రావం అయ్యే ముప్పు, పురుషుల్లో సంతానలేమి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. ఈ ఇంజెక్షన్లను అక్రమంగా నిల్వ చేయడం లేదా విక్రయించడం డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం ప్రకారం నేరమని... దీనికి గరిష్టంగా ఐదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిజామాబాద్ డీసీఏ డిప్యూటీ డైరెక్టర్ కె. దాస్, పటాన్‌చెరువు అసిస్టెంట్ డైరెక్టర్ పి. రాము పర్యవేక్షణలో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు ఎం. చంద్రశేఖర్, ఎం. వరప్రసాద్, ఎన్. రవికిరణ్ రెడ్డి, టి. ప్రవీణ్ కుమార్ ఈ దాడుల్లో పాల్గొన్నారు. అధికారులు శాంపిల్స్‌ను సేకరించి విశ్లేషణకు పంపారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీఏ డైరెక్టర్ జనరల్ అవినాష్ మహంతి ప్రకటించారు.

# సాంప్రదాయంగా ధ్వజస్తంభ, విగ్రహాల ప్రతిష్ఠోత్సవం

**రాజపేట శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవాలయంలో ముగిసిన ఉత్సవాలు**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భక్తుల జయజయ ద్వానాలు వైదిక బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణాలు సాంప్రదాయ కార్యక్రమాలు దాతలు భక్తుల చప్పట్లు మేళ తాళాల మధ్య సాంప్రదాయ బద్ధంగా ధ్వజస్తంభ సూర్యనారాయణ మూర్తి సంతాన నాగేంద్ర స్వామి వారి విగ్రహాల ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. శుక్రవారం ఉదయం 10:54 నిమిషం లకు రాజపేట గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవాలయం వద్ద ఈ మహోత్సవ కార్యక్రమాన్ని జరిపారు. ఆలయ అర్చక స్వాములు చలివేదుల రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమ నిర్వహణ జోషి మల్లకార్జున శర్మ, చలివేదుల రాజేశ్వర శర్మ బృందం పూజా కార్యక్రమాలు నిర్వహించగా శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం కమిటీ సభ్యులు భక్తులు పెరికకుల సంఘం వారు కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం దేవత పూజలు గురు వందనం హోమం గర్తన్యాసం యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, బలిహరణం పూర్ణాహుతి మహదాశీర్వచనం తీర్థ ప్రసాద వితరణ అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. గౌరవ అధ్యక్షులు సోమసాని రాజమల్లయ్య, అధ్యక్షులు బెడిద నర్సింలు, జిల్లా పెరిక సంఘం అధ్యక్షులు మేడిశెట్టి సత్యనారాయణ, ధ్వజస్తంభ దాత తోరణాల సంజయ్ గుప్తా చంద్రకళ కుమారుడు సుబ్రహ్మణ్యం పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాతలు భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా ఆలయ పరిసరాలతో పాటు గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. మూడు రోజులపాటు సాంప్రదాయ బద్ధంగా జరిగిన కార్యక్రమం ముగిసిందని ఆలయ అర్చక స్వాములు చలివేదుల రాజేశ్వర శర్మ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమ విజయవంతంలో భాగస్వాములైన దాతలు భక్తులు నిర్వాహకులు సేవకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు.



**ధ్వజస్తంభ దాత కుటుంబానికి ఘన సత్కారం**

ఆలయ ధ్వజస్తంభ దాత తోరణాల సంజయ్ గుప్తా చంద్రకళ పుణ్య దంపతులు వారి కుమారుడు సుబ్రహ్మణ్యం లకు ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఆలయ



అర్చకులు చలివేదుల రాజేశ్వరి శర్మ ఇతర అర్చక బృందం వేద ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలతో సత్కరించారు. నిర్వాహకులు భక్తులు ధ్వజస్తంభదాత కుటుంబానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు.

# సిఎం రేవంత్ రెడ్డి లక్ష్యం గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ స్థాయి విద్య

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను తెలంగాణ



రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శుక్రవారం సందర్శించారు. ఆలేరు నియోజకవర్గం లోని మోటకొండూరు మండల కేంద్రంలో ఈ మధ్య మంజూరైనటువంటి తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణం, అక్కడ జరిగే కార్యకలాపాలు ఎలా ఉండబోతోందో పూర్తి స్థాయిలో పైలెట్ పాఠశాలలో పర్యవేక్షించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో ఆధునిక వసతులతో ఆంగ్ల మాధ్యమంలో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను అందిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తున్న ఈ పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూమ్‌లు, క్రీడా మైదానం, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, కార్పొరేట్ పాఠశాల తరహా బోధన విధానం, ప్రీ-ప్రైమరీ విద్యార్థుల కోసం ప్రత్యేక ఆట వస్తువులు, ఆధునిక ఫర్నిచర్ వంటి సౌకర్యాలను ఆయన కలియతిరిగి పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సకల సౌకర్యాలు కల్పిస్తూ పాఠశాలను అభివృద్ధి చేస్తున్న నిర్వాహకులను ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.... గ్రామీణ ప్రాంతాల్లో కూడా కార్పొరేట్ స్థాయి విద్య అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. ఇలాంటి గొప్ప పాఠశాలను ఆలేరు నియోజకవర్గం లోని మోటకొండూరు మండలానికి ఇవ్వడం, చాలా సంతోషకరమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యా విధానం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ అనే తేడా లేకుండా ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందాలని,




అలాంటి లక్ష్యంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ పని చేయడం సంతోషకరమన్నారు. విద్యార్థుల్లో చదువుతో పాటు క్రీడలు,




సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇవ్వడం మంచి పరిణామమని తెలిపారు.

# చెరువు మట్టి విక్రయానికి పాలకవర్గం సిద్ధం

**అధికారుల అనుమతులు లేకుండానే మట్టిని తరలిపు**

**ఈ విషయంపై తక్షణమే కలెక్టర్ స్పందించాలంటున్న గ్రామ ప్రజలు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం దూది వెంకటాపురం చెరువు నుండి మట్టితోడేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం సిద్ధమైంది. అందుకోసం ఇటుక బట్టి వ్యాపారులతో చర్చలు జరిపి ధరను కూడా నిర్ణయించారు. గుడ్ విల్ ఇచ్చేందుకు మట్టి మాఫియా లీడర్లు సిద్ధమయ్యారు. సర్పంచ్ ఉప సర్పంచ్ నేతృత్వంలో శాంపిల్ గా రెండు టిప్పర్ల మట్టిని కూడా ఇటీవల ఇటిక బట్టీలకు తరలించి ఒప్పందాలకు కుదుర్చుకున్నారు. కాగా కొందరు గ్రామ ప్రజలు ఆక్షేపించడంతో గందరగోళం నెలకొంది. మైనింగ్, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారుల అనుమతులు లేకుండానే మట్టిని తరలిస్తున్నారు. అధికారులు పరోక్షంగా మద్దతిస్తున్నారని వాదన నెలకొంది. ఈ విషయంపై తక్షణమే కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# జనాభా లెక్కల కోసం వచ్చే ఉపాధ్యాయులకు సహకరించాలి : తహసీల్దార్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మే 11 నుండి జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం అవుతున్నందున రాజపేట మండల ఛార్జ్ ఆఫీసర్, తహసీల్దార్ వల్లపు ప్రదీప్ మండల ప్రజలకు శుక్రవారం పలు సూచనలు చేశారు. జనాభా గణన చేయడానికి వచ్చే ఉపాధ్యాయులకు ప్రజలు సహకరించి అడిగిన సమాచారం అందించాలని కోరారు. ఇట్టి సమాచారం ఇవ్వడం వలన ఎటువంటి సంక్షేమ పథకాలు రద్దు కావు అని తెలిపారు. పంచాయతీ కార్యదర్శిలు, గ్రామ పంచాయతీ సిబ్బంది అందుబాటులో ఉండి జనాభా గణన చేసే ఉపాధ్యాయులకు సహకరించాలని తెలిపారు. జనాభా లెక్కల వలన మన దేశ అభివృద్ధికి మౌలిక సదుపాయాలు మెరుగు పరచడం కోసం ఉపయోగపడుతుంది అని తహసీల్దార్ తెలిపారు.

# ఐకెపి సెంటర్ ను సందర్శించిన నాగిరెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** డి.ఆర్.డి.ఓ. నాగిరెడ్డి శుక్రవారం రాజపేట మండలం పారుపల్లి ఐకెపి సెంటర్ ను ఆకస్మికంగా సందర్శించారు. సెంటర్ కు సంబంధించిన రికార్డులు పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఐకెపి సెంటర్లు సజావుగా నిర్వహించమని సెంటర్ సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మురరి, సిసి రాజేష్, ఏఈఓ అంజయ్య, పారుపల్లి ఐకెపి సెంటర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మెడిసిటీ హాస్పిటల్ ఆద్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం మెడిసిటీ హాస్పిటల్ మేడ్చెల్ అద్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ కోయ, మధు ఉప సర్పంచ్ నమిల కేదారి గౌడ్ శిబిరాన్ని ప్రారంభించారు. ఉచిత మందులు అందజేశారు. ప్రజల అధిక సంఖ్యలో శిబిరాన్ని సద్వినియోగం చేసుకోగా ఆసుపత్రి వారికి సర్పంచ్, ఉప సర్పంచ్ కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సాయిలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## రాజపేటలో గొంగిడి మహేందర్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలో ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ కూడలి వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేయడం జరిగింది. తదనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సందిల భాస్కర్ గౌడ్, చామకూర గోపాల్ గౌడ్, ఎడ్ల బాలలక్ష్మి, గుంటి మధుసూదన్ రెడ్డి, కాకల్ల ఉపేందర్, ఎర్రగోకుల జశ్వంత్, బూర్గు నర్సిరెడ్డి, బొడ్డు భాస్కర్, గోపగాని యాదగిరి గౌడ్, మేక వెంకటేశ్వర రెడ్డి, గుర్రం నరసింహులు, బొంగోని ఉప్పలయ్య గాడ్, విష్ణు, కోయ బాలరాజు, గంధమల్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జ్యోతి రెడ్డి లను సన్మానించిన తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : భువనగిరి "కుంభం ఫౌండేషన్ (కుంభం కీర్తి రెడ్డి) ఆధ్వర్యంలో 'న్యూ డైమెన్షన్ హైస్కూల్' ప్రాంగణంలో (వన్ మిలియన్ వన్ బిలియన్) సంస్థ ఆధ్వర్యంలో భారీ మెగా జాబ్ మేళా కార్యక్రమంలో భాగంగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కిరణ్ జ్యోతి రెడ్డి లను సన్మానించిన భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్,

## సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం, విప్ బిర్ల చిత్ర పటాలకు పాలాభిషేకం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** దొమ్మర కులాన్ని గడవంశీయ కులస్తులుగా పేరు మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, రాష్ట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బిర్ల ఐలయ్య ల చిత్ర పటాలకి గడవంశీయ కులస్తులు పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుల సభ్యులు కంసాని మహేష్, భాస్కర్, రాములు, మానెమ్మ, కంసాని సుజాత, కృష్ణ, వెంకటేష్, జయతి, చంద్రమౌళి, నరసింహారావు, సుధాకర్, శంకర్, చందు, సుశీల, భారతమ్మ, అరుణ, నాగమణి, నీలమ్మ, పార్వతి పాల్గోవడం జరిగింది




## వర్తక సంఘాన్ని రద్దు చేసిస్థానిక నిరుద్యోగులకు కేటాయించాలని యాదాద్రి పరిరక్షణ కమిటీ ధర్నా



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయం ముందు యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేస్తూ అవి స్థానిక నిరుద్యోగులకు చెందేలా టెండర్ వేయాలని ప్లకార్డులతో ధర్నా నిర్వహించి అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్ రావు కి మరియు రెవెన్యూ అండ్ ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పరిరక్షణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అతి తక్కువ కిరాయితో కొండపైన దుకాణాలు నిర్వహిస్తూ వాటిని రెన్యువల్ చేసుకుంటూ కొత్తవారికి అవకాశం ఇవ్వకుండా అధిక రేట్లకు అమ్ముతూ భక్తులను ఇబ్బంది పెడుతున్నటువంటి వర్తకసంఘాన్ని తక్షణమే రద్దు చేస్తూ టెండర్లు వేయాలని డిమాండ్ చేయడం జరిగింది. గతంలో కేవలం 30, 40 షాపులే ఉండేవి. ఇప్పుడు వాటిని 114 షాపులుగా పెంచారు. రాజకీయ, అధికార బలంతో ఇష్టం వచ్చిన విధంగా ఈ షాపులను కేటాయిస్తున్నారు. స్వామివారి అభివృద్ధిలో భాగంగా వీళ్లు ఎటువంటి ఆస్తులు కోల్పోలేదు, స్వామి వారి కోసం ఎంతోమంది వారి ఇండ్లను భూములను కోల్పోయిన వారికి ఎటువంటి న్యాయం జరగలేదు. గత ప్రభుత్వం వీరికి కొండ క్రింద నూతనముగా కొన్ని కోట్లు ఖర్చు చేసి షాప్ లను నిర్మించడం జరిగింది. ఇట్టి వర్తక సంఘం వల్ల దేవస్థానానికి మరియు భక్తులకు నష్టమే తప్ప లాభం లేదు. కావున తక్షణమే వర్తక సంఘాన్ని రద్దుచేసి



స్థానికులకు అందుబాటులో ఉండే విధంగా టెండర్లు వేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాటబత్తిని ఆంజనేయులు, బండ రామస్వామి, దేవపూజ అశోక్, పల్లపు బాలయ్య, దండబోయిన వీరేష్, పబ్బల ఉప్పలయ, మిరియాల కృష్ణ, ఆకుల అనిల్, బండి అనిల్, వంగపల్లి అరుణ్, మందోజు నరేష్, కొన్నె సంజీవ, కర్రె ప్రవీణ్, దార నవీన్, గోపగాని ప్రసాద్ , జోరిగళ్ల ప్రశాంత్, కర్రే శ్యామ్, గుండు కుమార్, ఆరె కుమార్, దార క్రిష్ణ, పల్లపు రాజు, శ్రీనాథ్, వంశీ, రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన విప్ బీర్ల





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 08, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి** : యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలం మరియు తుర్కపల్లి మండలం పరిధిలో జరిగిన పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వం విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పేద కుటుంబాలకు చెందిన ఆడపిల్లల పెళ్లిళ్లకు బీర్ల ఫౌండేషన్ తరఫున ఆర్థిక సహాయం అందజేశారు. "ఆడపిల్ల పెళ్లి ప్రతి కుటుంబానికి ఒక పెద్ద బాధ్యత. అలాంటి సమయంలో వారికి తోడుగా నిలిచి ఆర్థిక సహాయం చేయడం మా బాధ్యతగా భావిస్తున్నాం. ప్రజల సంతోషంలో భాగస్వాములు కావడం ఎంతో ఆనందంగా ఉంది" అని తెలిపారు.

## చిప్స్ తింటూ కూల్ డ్రింక్స్ తాగితే యమ డేంజర్

ఇంటర్నెట్ డెస్క్: వేసవిలో చాలా మంది చల్లని పానీయాలు తాగడానికి ఇష్టపడతారు. ఇవి చాలా రుచిగా ఉండటంతో పాటు వెంటనే చల్లదనం కూడా ఇస్తాయి. కొందరు ఈ పానీయాలతో పాటు చిప్స్ కూడా తింటారు. అయితే, ఇది సాధారణంగా కనిపించే అలవాటు అయినప్పటికీ, ఆరోగ్యానికి హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**తాత్కాలికంగా..**

చల్లని పానీయాలలో చక్కెర ఎక్కువగా ఉంటుంది. కొన్నింటిలో కెఫీన్ కూడా ఉంటుంది. ఇవి తాగినప్పుడు తాత్కాలికంగా దాహం తగ్గినట్లు అనిపించినా, వాస్తవానికి శరీరంలో నీరు తగ్గే అవకాశం ఉంది. దీని వల్ల నీరసం, తల తిరగడం, అలసట వంటి సమస్యలు రావచ్చు. వేసవిలో శరీరానికి తగినంత నీరు అవసరం కాబట్టి ఇది మరింత ప్రమాదకరం.

**దీర్ఘకాలంలో వ్యాధుల ప్రమాదం**

ఇక చిప్స్ విషయానికి వస్తే, వాటిలో ఉప్పు, హానికరమైన కొవ్వులు (ట్రాన్స్ ఫ్యాట్స్) ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలో నీటిని తగ్గించడమే కాకుండా, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కూడా దెబ్బతీస్తాయి. ఎక్కువ ఉప్పు తీసుకోవడం వల్ల దాహం మరింత పెరుగుతుంది. దాంతో మళ్లీ మళ్లీ చల్లని పానీయాలు తాగే అలవాటు పెరుగుతుంది.



ఈ రెండు కలిపి తరచుగా తీసుకుంటే, దీర్ఘకాలంలో బరువు పెరగడం, జీర్ణ సమస్యలు, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా పిల్లలు, యువతలో ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

**చిప్స్‌కు బదులుగా..**

అందుకే ఈ అలవాటును తగ్గించడం మంచిది. చల్లని పానీయాల బదులుగా నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీరు వంటి సహజ పానీయాలు తాగడం మంచిది. ఇవి శరీరానికి తేమను అందించి, ఆరోగ్యాన్ని కాపాడుతాయి. చిప్స్‌కు బదులుగా వేయించిన మఖానా, వేరుశెనగలు లేదా తాజా పండ్లు తినడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## ఉప్పు, చక్కెర ఎక్కువ వాడుతున్నారా? మీ ప్రాణాలు ప్రమాదంలో ఉన్నట్టే!

ఇంటర్నెట్ డెస్క్: నేటి ఆధునిక జీవనశైలిలో ప్రజలు ఉప్పు, చెక్కరలను అధికంగా వినియోగిస్తున్నారు. రెండూ ఆహార రుచిని పెంచడానికి ఉపయోగపడతాయి. అయితే, మోతాదులో తింటేనే ఆరోగ్యం అన్ని విధాలా బావుంటుంది. లేదంటే ఎన్నో అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నట్టు.. ఏదీ మితిమీరినా ప్రమాదమే. ఉప్పు, చక్కెరల వాడకాన్ని నియంత్రించి, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా నిండు నూరేళ్లు జీవించవచ్చు. 1. ఉప్పులో ఉండే సోడియం శరీరానికి అవసరమే అయినప్పటికీ, అది ఎక్కువైతే రక్తపోటు పెరుగుతుంది. శరీరంలో సోడియం పెరిగితే రక్తనాళాలపై ఒత్తిడి పెరిగి 'హై బిపి'కి దారితీస్తుంది. దీర్ఘకాలిక అధిక రక్తపోటు వల్ల గుండెపోటు, స్ట్రోక్ వచ్చే అవకాశం ఉంది. ఉప్పు ఎక్కువైతే మూత్రపిండాల వడపోత సామర్థ్యం తగ్గి, కిడ్నీ వ్యాధులు వస్తాయి.

2. చక్కెరను 'వైట్ పాయిజన్' అని పిలుస్తారు. చక్కెరలో క్యాలరీలు ఎక్కువ. ఇది శరీరంలో కొవ్వు పేరుకుపోయేలా చేసి బరువును పెంచుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం వల్ల ఇన్సులిన్ నిరోధకత ఏర్పడి 'టైప్-2 డయాబెటిస్'కు కారణమవుతుంది. అతిగా చక్కెర తీసుకోవడం వల్ల కాలేయంలో కొవ్వు చేరుతుంది.

3. మనం ఎక్కువ ఉప్పు తీసుకున్నప్పుడు, మన శరీరం ఆ అధిక సోడియంను మూత్రం ద్వారా బయటకు పంపే ప్రయత్నం చేస్తుంది. ఈ ప్రక్రియలో సోడియంతో పాటు కాల్షియం కూడా శరీరం నుంచి బయటకు పోతుంది. దీనివల్ల ఎముకలు సాంద్రత కోల్పోయి బలహీనపడతాయి. చిన్న దెబ్బలకే ఎముకలు విరిగే ప్రమాదం పెరుగుతుంది.

4. అతిగా చక్కెర తీసుకోవడం వల్ల చర్మం తన మెరుపును కోల్పోతుంది. రక్తంలోని చక్కెర, ప్రోటీన్లతో కలిసి హానికరమైన అణువులను ఉత్పత్తి చేస్తుంది. ఇది చర్మంలోని కొల్లాజెన్‌ను దెబ్బతీసి, చిన్న వయసులోనే ముడతలు వచ్చేలా చేస్తుంది. మొటిమలు, చర్మ సంబంధిత అలర్జీలు కూడా పెరగవచ్చు.

5. చక్కెర, ఉప్పు కేవలం శారీరక ఆరోగ్యాన్నే కాదు, మానసిక స్థితిని కూడా ప్రభావితం చేస్తాయి. చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలు తిన్నప్పుడు వెంటనే శక్తి వచ్చినట్లు అనిపిస్తుంది, కానీ కాసేపటికే నీరసం, చిరాకు ఆవహిస్తాయి. అధిక ఉప్పు వల్ల నిద్రలేమి, ఆందోళన వంటి సమస్యలు తలెత్తవచ్చు.

జాగ్రత్త పడటం ఎలా?

చిప్స్, ప్యాక్ చేసిన స్నాక్స్, సాఫ్ట్ డ్రింక్స్‌లో ఉప్పు, చక్కెరలు అత్యధికంగా ఉంటాయి. వాటిని వీలైనంత వరకు తగ్గించండి.




కూరల్లో ఉప్పుకు బదులు నిమ్మరసం లేదా ఇతర సహజ మసాలాలను వాడటానికి ప్రయత్నించండి.

ఏదైనా వస్తువు కొనే ముందు అందులో ఎంత సోడియం లేదా షుగర్ ఉందో గమనించండి.

నీరు ఎక్కువగా తాగండి.. ఇది శరీరంలోని అదనపు సోడియంను బయటకు పంపడానికి సహాయపడుతుంది.

సైంధవ లవణంలో కూడా సోడియం ఉంటుంది, కాబట్టి దాన్ని కూడా పరిమితంగానే వాడాలి.

బెల్లం పంచదార కంటే మేలైనదే కానీ, అది కూడా ఒక రకమైన చక్కరే. డయాబెటిస్ ఉన్నవారు లేదా బరువు తగ్గాలనుకునే వారు బెల్లాన్ని కూడా తక్కువగానే తీసుకోవాలి.



# నేటి రాశిఫలాలు

మేషం : మేష రాశి వారికి ఈ రోజు మిశ్రమ ఫలితాలు ఉంటాయి. ఉద్యోగంలో పరిస్థితులకు అనుగుణంగా తెలివిగా వ్యవహరించడం వలన మేలు జరుగుతుంది. వ్యాపారంలో సమిష్టి నిర్ణయాలతో లాభాలు పెరుగుతాయి. అనవసర ధనవ్యయం ఉండవచ్చు. బంధువులతో విభేదాలు రాకుండా చూసుకోండి. కుటుంబంలో ప్రశాంతమైన వాతావరణం ఉంటుంది. అనారోగ్య సమస్యలు ఇబ్బంది పెడతాయి. నవగ్రహ శ్లోకాలు పఠిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయి.

వృషభం : వృషభ రాశి వారికి ఈ రోజు అనుకూలంగా ఉంటుంది. అన్ని రంగాల వారికి తమ తమ రంగాల్లో కార్యసిద్ధి ఉంటుంది. అనుకున్న పనులు సులభంగా నెరవేరుతాయి. ఉద్యోగంలో కీలక మార్పులు చోటు చేసుకోవచ్చు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో స్థిరమైన బుద్ధితో తీసుకునే నిర్ణయాలు మేలు చేస్తాయి. కుటుంబ సభ్యులతో మంచి సమయం గడుపుతారు. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి. అభయ ఆంజనేయస్వామి దర్శనం శుభకరం.

మిథునం : మిథున రాశి వారికి ఈ రోజు శుభప్రదంగా ఉంటుంది. మానసిక సంతోషం కలిగించే సంఘటనలు జరుగుతాయి. మనోబలంతో ప్రారంభించిన పనులు పూర్తిచేస్తారు. ఉద్యోగంలో పదోన్నతులు అందుకోవడంతో ఉత్సాహంగా ఉంటారు. వ్యాపారంలో సరికొత్త వ్యూహాలతో లాభాలు పెరుగుతాయి. ఆర్థికపరమైన అంశాల్లో అనుకూలత ఉంటుంది. నూతన వాహనయోగం ఉంది. అధికారయోగం, పదవి యోగం ఉన్నాయి. కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి. కుటుంబంలో సంతోషకరమైన వాతావరణం ఉంటుంది. ఆరోగ్యం సహకరిస్తుంది. శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం శుభకరం.

కర్కాటకం : కర్కాటక రాశి వారికి ఈ రోజు మిశ్రమ ఫలితాలు ఉంటాయి. వ్యాపారులకు ఈ రోజు చాలా అదృష్టమైన రోజు. పెట్టుబడులు, లాభాలు గణనీయంగా పెరుగుతాయి. వ్యాపార విస్తరణకు అనువైన సమయం. ఉద్యోగంలో ఆటంకాలు రాకుండా ముందుచూపుతో వ్యవహరించాలి. ఆర్థిక పరిస్థితి సామాన్యంగా ఉంటుంది. ఖర్చులు అదుపులో ఉంచుకోండి. కుటుంబ వ్యవహారాల్లో సమయం, సందర్భం దృష్టిలో ఉంచుకుని ముందడుగు వేస్తే శుభం జరుగుతుంది. ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయవద్దు. విఘ్నవినాయకుని ప్రార్థన ప్రశాంతతనిస్తుంది.

సింహం : సింహ రాశి వారికి ఈ రోజు అనుకూలంగా ఉంటుంది. వృత్తి ఉద్యోగ వ్యాపారాది రంగాల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించి ఆటంకాలు అధిగమిస్తారు. వృత్తి రీత్యా చేసే ప్రయాణాలు ఫలిస్తాయి. డబ్బుకు లోటుండదు. ఆదాయ మార్గాలు విస్తరిస్తాయి. కుటుంబసభ్యులు, సన్నిహిత మిత్రులతో కలిసి విహారయాత్రలకు వెళ్తారు. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం సహకరిస్తుంది. శ్రీ సుబ్రహ్మణ్య స్వామి దర్శనం శుభకరం.

కన్య: కన్య రాశి వారికి ఈ రోజు అనుకూలంగా ఉంటుంది. అన్ని రంగాల వారికి తమ తమ రంగాల్లో కృషికి తగిన ఫలితాలు ఉంటాయి. ఒక సందర్భంలో సన్నిహితుల వలన మేలు జరుగుతుంది. ముఖ్య విషయాల్లో స్వీయ నిర్ణయాలకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. ఉద్యోగ వ్యాపారాల్లో ప్రోత్సాహకరమైన వాతావరణం ఉంటుంది. ధన,వస్తు లాభాలున్నాయి. కుటుంబంలో ఆనందకరమైన వాతావరణం ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. దుర్గాదేవి దర్శనం శుభకరం.

తుల : తులా రాశి వారికి ఈ రోజు ఫలవంతంగా ఉంటుంది. ఉద్యోగ వ్యాపారాల్లో మీ కృషిని అధికారులు గుర్తిస్తారు. మనోధైర్యంతో చేసే పనులు సత్ఫలితాన్నిస్తాయి. ఆర్థికంగా మేలైన సమయం. పూర్వీకుల ఆస్తులు కలిసి వస్తాయి. సన్నిహితులతో పర్యాటక ప్రదేశాలకు వెళ్తారు. మిత్రులతో ఉత్సాహంగా గడుపుతారు. కుటుంబ వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. శత్రువులపై విజయం సాధిస్తారు. ఆరోగ్యం సహకరిస్తుంది. గణనాయకాష్టకం పఠించడం శుభకరం.

వృశ్చికం : వృశ్చిక రాశి వారికి ఈ రోజు ఆనందదాయకంగా గడుస్తుంది. అదృష్టం వరిస్తుంది. ఉద్యోగంలో అధికారులు నిర్ణయాలు మీకు అనుకూలంగా ఉంటాయి. వ్యాపారంలో పెట్టుబడులు మంచి లాభాలు అందిస్తాయి. ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి. ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉంటుంది. కొత్త వ్యాపారంలో మీ కృషికి తగిన ప్రతిఫలం లభిస్తుంది. మీ ప్రతిభతో అందరికీ ఆదర్శంగా నిలుస్తారు. ఆరోగ్యం సహకరిస్తుంది. ఇష్ట దేవతారాధన శుభకరం.

ధనుస్సు : ధనుస్సు రాశి వారికి ఈ రోజు సామాన్యంగా ఉంటుంది. ఉద్యోగంలో శ్రమ, పనిఒత్తిడి పెరుగుతాయి. ప్రారంభించిన పనుల్లో జాప్యం జరగకుండా చూసుకోండి. వ్యాపారంలో నిదానించి నిర్ణయాలు తీసుకోవాలి. తొందరపాటు నిర్ణయాలతో నష్టం వాటిల్లుతుంది. కీలక వ్యవహారాల్లో అనుభవజ్ఞుల సలహాలు పాటించడం మంచిది. ఆదాయాన్ని మించిన ఖర్చులు ఆందోళన కలిగిస్తాయి. బంధువులతో వివాదాలు రాకుండా జాగ్రత్త పడండి. అనారోగ్య సమస్యలు ఇబ్బంది పెడతాయి. సూర్య ఆరాధన శ్రేయస్కరం.

మకరం : మకర రాశి వారికి ఈ రోజు అనుకూలంగా ఉంటుంది. ఉద్యోగ వ్యాపారాల్లో విజయావకాశాలు పెరుగుతాయి. ప్రారంభించిన పనులు విజయవంతంగా పూర్తి చేసి అందరి ప్రశంసలు అందుకుంటారు. ఆర్థిక పరమైన లాభాలు పొందుతారు. కుటుంబంలో మంచి సమయం గడుపుతారు. సామాజిక కార్యకలాపాల కోసం అధిక ధనవ్యయం చేస్తారు. ఆరోగ్యం స్వల్పంగా ఇబ్బంది పెడుతుంది. కార్యసిద్ధి హనుమ ఆరాధన శ్రేయస్కరం.

కుంభం: కుంభ రాశి వారికి ఈ రోజు శుభప్రదంగా ఉంటుంది. మీ లక్ష్యాలు, ఆశయాలు అన్ని నెరవేరుతాయి. ఉద్యోగ వ్యాపారాల్లో విజయపరంపరాలు కొనసాగుతాయి. ఆర్థికంగా మీ అంచనాలకు మించిన లాభాలు పొందుతారు. కుటుంబ బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహిస్తారు. కొత్త పనులు ప్రారంభించడానికి ఈ రోజు శుభప్రదమైన రోజు. సామాజికంగా మంచి కీర్తి ప్రతిష్ఠలు సాధిస్తారు. అవివాహితులకు కల్యాణయోగం ఉంది. జీవిత భాగస్వామితో విహారయాత్రలకు వెళ్తారు. ఆరోగ్యం బాగుటుంది. శ్రీలక్ష్మి గణపతి ఆలయ సందర్శన శుభకరం.

మీనం : మీన రాశి వారికి ఈ రోజు సామాన్యంగా ఉంటుంది. మనోబలంతో చేసే పనులు సత్ఫలితాన్నిస్తాయి. ఉద్యోగంలో శ్రమ పెరుగుతుంది. వ్యాపారంలో దృఢ సంకల్పంతో తీసుకునే నిర్ణయాలు మేలు చేస్తాయి. ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది. ప్రతికూల ఆలోచనలు వీడితే మంచిది. కుటుంబంలో కలహాలు రాకుండా కోపావేశాలు అదుపులో ఉంచుకోండి. అనారోగ్య సమస్యలు కొంత ఇబ్బంది పెడతాయి. ఆదిత్య హృదయం పారాయణతో ప్రతికూలతలు తొలగుతాయి.

# ఫ్యామిలీతో కలిసి రెస్టారెంట్స్ కు వెళ్తున్నారా?

## ఈ టిప్స్ పాటిస్తే "డబ్బులు" సేవ్?!



ఒకప్పటితో పోలిస్తే రెస్టారెంట్లకు వెళ్లే వారి సంఖ్య పెరిగింది. బర్త్‌డే, మ్యారేజ్ డే ఇలా అకేషన్ ఏదైనా కుటుంబంతో కలిసి బయట తినడం పరిపాటి అయ్యింది. కేవలం అకేషన్స్ అప్పుడు మాత్రమే కాకుండా పిల్లలు అడిగారనో, తినాలనిపించదనో కూడా వెళ్తుంటారు. కాగా ఇంటి భోజనంతో పోలిస్తే.. బయట హోటల్స్‌లో తింటే ఖర్చు ఎక్కువ అవుతుంది. అయితే అది ఆర్థిక భారం కాకూడదు. అందుచేత తరచూ బయట తినేవారు, అప్పుడప్పుడూ రెస్టారెంట్లకు వెళ్లేవారు కొన్ని చిట్కాలు పాటిస్తే ఆ ఖర్చులు తగ్గించుకునే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ఆ వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.రద్దీ లేని సమయాలు: వీకెండ్స్ తో పోలిస్తే సాధారణ రోజుల్లో రెస్టారెంట్లలో రద్దీ తక్కువ ఉంటుంది. వ్యాపారులు కూడా ఆయా రోజుల్లో ఆహార పదార్థాలపై ఆఫర్స్, డిస్కౌంట్స్ ఇస్తుంటారు. అంతేకాదు సాయంత్రం 7 గంటలకు ముందు కూడా కొన్ని పేరున్న హోటల్స్ కూడా హ్యాపీ అవర్స్ కింద పరిగణించి ధరల్లో రాయితీని ప్రకటిస్తాయి. హోటల్ బిల్లు తగ్గించుకోవాలనుకునేవారు రద్దీలేని రోజులను, సమయాలను ఉపయోగించుకుంటే మంచిదంటున్నారు. అదే విధంగా డిన్నర్‌తో పోలిస్తే లంచ్ మెనూలు తక్కువ ధరలను కలిగి ఉంటాయి కాబట్టి డబ్బు ఆదా చేసుకోవడానికి వీలున్నంతవరకు మధ్యాహ్న భోజనాన్ని ఎంచుమంటున్నారు. ముఖ్యంగా ఫ్రెండ్‌షిప్ డే, వాలెంటైన్స్ డే రోజున రెస్టరంట్స్‌కు వెళ్లకపోవడమే మంచిదని సూచిస్తున్నారు.ముందే ప్లాన్ అవసరం: రెస్టారెంట్‌కు వెళ్లే ముందే ఎలాంటి ఆహారం తీసుకోవాలనే దానిపై ముందుగా ప్లాన్ చేసుకోవడం మంచిదంటున్నారు. దీనివల్ల ఆహార ఖర్చు ఎంత అవుతుందో ముందుగానే తెలుసుకోవచ్చని.. ఈ క్రమంలో అనవసర ఖర్చును తగ్గించుకోవడంతో పాటు తినే ఆహారంపై కూడా కంట్రోల్ ఉంటుందని చెబుతున్నారు. అందువల్ల వంటకాలు, పానీయలను జాగ్రత్తగా ఎంచుకోవడం ద్వారా ముందుగా అనుకున్న బడ్జెట్‌కు కట్టుబడి ఉండొచ్చని సూచిస్తున్నారు.క్రెడిట్ కార్డులు: కొన్ని క్రెడిట్ కార్డులు భాగస్వామ్య రెస్టారెంట్లలో ప్రత్యేకమైన డైనింగ్ డీల్స్, డిస్కౌంట్స్ లేదా ప్రత్యేక ప్రమోషన్స్ యాక్సెస్‌ను అందిస్తాయి. ఆయా రెస్టారెంట్స్ మీ క్రెడిట్ కార్డు సంస్థతో భాగస్వామ్యం కలిగి ఉన్నాయో లేదో తనిఖీ చేయండి. ఈ ఆఫర్లలో తరచుగా కొనుగోలుపై.. వన్ గెట్ - వన్ ఫ్రీ డీల్స్, కాంప్లిమెంటరీ డిషలు లేదా తగ్గింపు సెట్ మెనూలు ఉంటాయి. వీటి ద్వారా తక్కువ ధరలో నాణ్యమైన ఆహారాన్ని పొందడానికి అవకాశం ఉంటుంది. రివార్డ్స్‌ను అందించే క్రెడిట్ కార్డులను ఉపయోగించడం ద్వారా కూడా కష్టమర్లు డబ్బును ఆదా చేసుకోవచ్చు.ఆర్డర్ ఉమ్మడిగా: ఒక కుటుంబం మొత్తం లేదా స్నేహితులు కలిసి రెస్టారెంట్‌కు వెళ్లినప్పుడు.. వ్యక్తిగతంగా ఆహార పదార్థాలను ఆర్డర్ చేయడానికి బదులుగా ఉమ్మడిగా అందరూ కలిసి ఒకే జంబో ఫ్యామిలీ ప్యాక్‌ను ఆర్డర్ చేయడం మేలంటున్నారు. దీనివల్ల ఆహార ధర మీ భాగానికి తక్కువ పడడమే కాకుండా, ఆహార వృథా లేకుండా ఉంటుందని చెబుతున్నారు. అదే విధంగా ఒకటే డిష్? కాకుండా 2,3 రకాల వంటకాలను ఆర్డర్ చేసుకోవచ్చు. దీనివల్ల ఎక్కువ రకాలు ఆరగించినట్లు ఉంటుంది. ధరలపై కూడా ఆఫర్లు ఉంటాయి.ఆఫర్లు: వినియోగదారులు.. కొన్ని రెస్టారెంట్స్, సూపర్ మార్కెట్లకు వెళ్లినప్పుడు అక్కడ కొంతమంది సేల్స్ ప్రమోషన్ చేసే వ్యక్తులు.. కొన్ని ఫామ్స్ ఇచ్చి పూరించమని అడుగుతారు. రెస్టారెంట్ల నుంచి వచ్చిన ప్రతినిధులు అయితే, వినియోగదారుల పెళ్లి రోజు, కుటుంబ సభ్యుల పుట్టిన రోజు వివరాలను తీసుకుంటారు. తర్వాత, ఆ ప్రత్యేక రోజుల్లో ఆయా కుటుంబాలను రెస్టరంట్లకు ఆహ్వానించి రాయితీ ధరలకు ఆహార, పానీయాలను అందిస్తారు. ఇటువంటి ఆఫర్లు ఉన్నప్పుడు ఆయా కుటుంబాల వారు తప్పకుండా ఉపయోగించుకోవచ్చు. దీనివల్ల, మీ ప్రత్యేకమైన రోజును సెలబ్రేట్ చేసుకున్నట్లు ఉండడమే కాకుండా, తక్కువ ధరకే మంచి విందును ఆరగించొచ్చు.కూపన్స్ కూడా ముఖ్యమే: రెస్టారెంట్స్ లేదా ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్స్ అందించే కూపన్స్, వోచర్స్, లాయల్టీ ప్రోగ్రామ్‌ల ప్రయోజనాన్ని పొందితే.. ఇవి ఆహార ఖర్చులను గణనీయంగా తగ్గిస్తాయి. ఫైన్ డైనింగ్ రెస్టారెంట్స్ కోసం డైనింగ్ డీల్స్, డిస్కౌంట్ వోచర్లను అందించే అనేక వెబ్‌సైట్స్ ఉన్నాయి. ఇది పూర్తిగా రెస్టారెంట్లతో వారు కలిగి ఉన్న భాగస్వామ్యంపై ఆధారపడి ఉంటుంది.

ఈ యాప్స్ పనికొస్తాయి: EazyDiner, Swiggy's DineOut వంటి డైనింగ్ యాప్స్ టేబుల్స్ రిజర్వ్ చేయడానికి, డిస్కౌంట్స్ పొందేందుకు అనుమతిస్తాయి. ఈ ఫుడ్ సేవింగ్ యాప్స్‌ను ఉపయోగించడం ద్వారా, యాప్ ద్వారా మాత్రమే అందుబాటులో ఉండే ప్రత్యేక ఆఫర్స్, డిస్కౌంట్స్, ప్రత్యేకమైన డీల్స్‌ను పొందొచ్చని వివరిస్తున్నారు.ఇవి గమనించాలి: చాలా వరకు రెస్టారెంట్లు కొన్ని రకాల వంటకాలకు ఫేమస్. ఈ ఆహార పదార్థాల కోసమే వినియోగదారులు తరచూ అక్కడికి వెళుతుంటారు. అయితే, ఖర్చులు తగ్గించుకోవాలని భావించేవారు కేవలం అక్కడ లభించే ప్రత్యేక వంటకాలను ఆరగించడమే మంచిదని.. కూల్‌డ్రింక్స్, ప్యాకింగ్ వాటర్ బాటిల్స్‌ను తీసుకోకపోవడమే మేలంటున్నారు. ఎందుకంటే వీటిపై పన్నులు అదనంగా ఉండడం వల్ల ఖరీదు ఎక్కువ ఉంటుందని చెబుతున్నారు. చివరిగా సర్వర్ బిల్లు ఇచ్చినప్పుడు కూడా మీరు తీసుకున్న ఐటమ్స్‌కే బిల్లు ఉందని నిర్ధరించుకోవడం ముఖ్యమంటున్నారు.

# పిడుగుపాటును ముందే పసిగట్టే "యాప్స్"



వాతావరణంలో మార్పుల కారణంగా కాలంతో సంబంధం లేకుండా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఆకాశం ఉరిమిందంటే ఏదో చోట పిడుగుకాటుకు గురై మృత్యువాత పడుతున్నారు. పిడుగు శబ్దానికి కొందరు ప్రాణాలొదులుతుండగా మరికొందరు దాని తీవ్రతకు బలవుతున్నారు. ఫలితంగా కొన్ని కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపుతోంది. అంతేకాక పలు కుటుంబాలను రోడ్డు పాలు చేస్తోంది. ఈ క్రమంలో ముందుగానే పిడుగుపాటుకు గురికాకుండా ఉండేందుకు సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. దీనిద్వారా అపాయాన్ని ముందుగానే గుర్తించే వీలు కలుగుతుంది. అదేవిధంగా పలు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వీటి నుంచి రక్షణ పొందొచ్చని అధికారులు సూచిస్తున్నారు. మరి అవేంటో ఇప్పుడు చూద్దాం.

**మేఘదూత్‌తో వర్ష సమాచారం :**

భారత వాతావరణ శాఖ (ఐఎండీ), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటీయోరాలజీ సంయుక్తంగా వర్షంపై ముందస్తు సమాచారం తెలిపేందుకు మేఘదూత్ యాప్‌ను రూపొందించాయి. దీన్ని ప్లేస్టోర్‌లోకి వెళ్లి మొబైల్ నంబర్, రాష్ట్రం, జిల్లా, తాలూకా, పంచాయతీ వివరాలను నమోదు చేయాలి. ఆ తర్వాత లాగిన్ అవ్వడం ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా వర్ష సమాచారం, గాలి వేగం, గాలి దిశ, ఉష్ణోగ్రత, గాలిలో తేమశాతం తదితర వివరాలను ముందుగానే తెలుసుకోవచ్చు.

**దామిని యాప్ హెచ్చరిస్తోంది :**

వాతావరణానికి సంబంధించిన వివరాలు తెలుసుకునేలా కేంద్ర ప్రభుత్వం దామిని పేరుతో యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీన్ని ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తెలుగు భాషతో పాటు పలు భాషల్లో ఉంటుంది. తర్వాత మనం ఉండే లోకేషన్ వివరాలు అందులో తెలపాల్సి ఉంటుంది. ఈ యాప్ పిడుగుపాటును ముందుగానే గుర్తించి అప్రమత్తం చేస్తుంది. తద్వారా సురక్షిత ప్రాంతాలకు చేరుకొని రక్షణ పొందేందుకు వీలుంటుంది.

**రంగులు తెలిపే అర్థం :**

**రెడ్ కలర్ :** మీరు ఉన్న ప్రాంతంలో మరో ఏడు నిమిషాల్లో పిడుగు పడే అవకాశం ఉంటే ఈ యాప్‌లోని సర్కిల్ ఎరుపు రంగులోకి మారుతుందట.

**యెల్లో కలర్ :** మీ ప్రాంతంలో మరో పది నుంచి పదిహేను నిమిషాల్లో పిడుగు పడే ఛాన్స్ ఉంటే ఈ సర్కిల్ పసుపు కలర్‌లోకి ఛేంజ్ అవుతుందట.

**బ్లూ కలర్ :** అలాగే మీరూ ఉన్న చోట మరో పద్దెనిమిది నుంచి ఇరవై ఐదు నిమిషాల్లో పిడుగు పడే ఛాన్స్ ఉంటే ఈ సర్కిల్ బ్లూ కలర్‌లోకి మారుతుందట.

**ఈ జాగ్రత్తలు అవసరం :**

మెరుపులు, ఉరుములు వచ్చే సమయాల్లో పొలాల్లో పనిచేస్తున్న అన్నదాతలు, కూలీలు, పశువుల కాపరులు, బహిరంగ ప్రదేశాల్లో ఉండే వారు ముందుగానే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి.ఎత్తైన టవర్లు, విద్యుత్, టెలిఫోన్ స్తంభాలు, చెట్ల కిందకు వెళ్లకూడదు. ఇది చాలా ప్రమాదకరం. చెట్లు పిడుగును త్వరగా ఆకర్షిస్తాయి. నిటారు చెట్ల కిందకి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండరాదు. ఇనుప గొడుగులు వేసుకుని బయటకు వెళ్లరాదు.సెల్‌ఫోన్, ఎఫ్ఎం రేడియో వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఉపయోగించరాదు.వర్షంతోపాటు ఉరుములు, మెరుపులు వస్తుంటే ఎత్తైన ప్రాంతాల్లో ఉంటే (పర్వతాలు, కొండల్లో) వెంటనే కిందకు దిగాలి.వ్యవసాయ క్షేత్రంలో లేదా నిర్మానుష్య ప్రాంతంలో ఉంటే భూమిపై బంతి ఆకారంలో కూర్చొని చెవులను గట్టిగా మూసుకోవాలి. భూమిపై నుంచి ఎంత ఎత్తు తగ్గితే అంత ప్రమాదం నుంచి రక్షణ పొందొచ్చు. పై నుంచి వచ్చే పిడుగు మొదట ఎత్తుగా ఉన్న వాటిని ఆకర్షించి వాటి ద్వారా విద్యుత్ భూమిలోకి ప్రసారమవుతుంది.పిడుగులు పడే సమయంలో సమూహంలో ఉన్నట్లయితే ప్రమాదాన్ని తగ్గించడానికి దూరం పాటించాలి.సరస్సులు, నదులు, చెరువులు, ఇతర నీటి వనరుల నుంచి వెంటనే బయటకు వచ్చి దూరంగా ఉండాలి.ఉరుములు, మెరుపులు, గాలివాన సమయంలో సైకిళ్లు, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలను నడపరాదు. అలాగే లోహపు వస్తువులను తాకరాదు.ఉరుముల సమయంలో ఇళ్లలో ఉన్నవారు కిటికీలు, తలుపులు మూసివేయాలి. ఇంట్లో కరెంట్ తో నడిచే అన్ని వస్తువులనూ ఆఫ్ చేయాలి.మెరుపులు వచ్చేటప్పుడు ఇంటిలో ఒకే చోట అందరు కూర్చోరాదు. దూరం దూరంగా ఉంటే ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చు.శరీరానికి కరెంటు షాక్ తగిలినట్లుగా అవ్వడం, వెంట్రుకలు నిటారుగా ఉన్నట్లు అనిపిస్తే పిడుగు పడే అవకాశం ఉన్నట్లు గుర్తించాలి. వెంటనే నేలపై పడుకోవాలి. సమీపంలో ఇళ్లు ఉంటే వెంటనే అక్కడికి వెళ్లి రక్షణ పొందాలి.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.